RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దినపత్రిక

సంచిక 19 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | శనివారం | జూలై 18, 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

స్థాయిని గమనించి సరదాగ మాటాడు
స్వార్థపరుల గడప వలదు మనకు
సంపదలును గలుగ సంబంధమును జూపి
కదిలివచ్చుచుండ్రు కపటులంత
మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్)
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.


# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

- ధరణి అక్రమాలపై విచారణకు సిట్ ఏర్పాటు
- ఇక పంచాయితీల నిధులను నేరుగా బ్యాంకులో జమ
- ట్రెజరీలో జమచేసే నిబంధన ఎత్తివేసిన కేబినేట్
- జగిత్యాల జిల్లా డిగ్రీకాలేజీలో పోస్టు భర్తీకి ఆమోదం
- పటాన్‌చెరులో ఇందిరమ్మ ఇళ్లకు భూ కేటాయింపు
- బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పునకు ఆమోదం
- దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు- సీతారామల అంచనా వ్యయాల పెంపు



**హైదరాబాద్,జూలై 17 :** తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం లభించింది. ప్రజా సంక్షేమం, పరిపాలన సంస్కరణలు, మౌలిక వసతుల అభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలను తీసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశం ముగిసింది. దాదాపు మూడుగంటలపాటు సమావేశమైన మంత్రివర్గం కీలక నిర్ణయాలు తీసుకుంది. ఈ సందర్భంగా ధరణి, నీటిపారుదల ప్రాజెక్టులు, బుల్లెట్ ట్రైన్, డిగ్రీ కళాశాలల్లో పోస్టుల భర్తీ, ఇందిరమ్మ ఇళ్లు, గ్రామ పంచాయతీల ఆదాయం వంటి అంశాలు ప్రధానంగా చర్చకు వచ్చాయి.క్యాబినెట్ భేటీలో పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి లావాదేవీలపై సమగ్ర విచారణ జరపాలని

మిగతా2లో...



# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

- హైడ్రోజన్ రైలుతో నూతన శకం ఆరంభం
- తొలి రైతులను జెండా ఊపి ప్రారంభించిన మోడీ
- అనేక ప్రత్యేకతలతో పర్యావరణహితంగా తయారీ

**న్యూఢిల్లీ,జూలై 17 :** దేశం లోనే మొట్టమొదటి హైడ్రోజన్ పవర్డ్ రైలును ప్రధాని మోదీ శు క్రవారం హర్యానాలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ రైలు హర్యాలోని జింద్, సోనిపట్ మధ్య (89 కి.మీ) నడవనుంది. పర్యావరణ పరిరక్షణకు, పచ్చదనాన్ని కాపాడుకోవడానికి రైల్వే వ్యవస్థలో ఇది ఒక చరిత్రాత్మక ముందడుగు అని ఈ సందర్భంగా ప్రధాని మోదీ అన్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో దీన్ని తయారు చేయడం దేశ గర్వకారణమని వెల్లడించారు. అధునాతన రైల్వే ఇంజినీరింగ్‌లో దేశ సామర్థ్యాలకు ఇది

మిగతా2లో...



## నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

- సరూర్‌నగర్ స్టేడియంలో సభ నిర్వహణ
- పోలీసుల అనుమతి నిరాకరణతో హైకోర్టు అనుమతి

**హైదరాబాద్,జూలై 17 :** బీఆర్ఎస్ పార్టీ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించ తలపెట్టిన 'బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ'కు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. శనివారం నాడు హైదరాబాద్‌లోని సరూర్‌నగర్

మిగతా2లో...

## ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

- నగదురహిత వైద్య సేవలకు శ్రీకారం
- ఇచ్చిన హామీ మేరకం పథకం ప్రారంభం




## రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

- నాలుగు జిల్లాల్లో చెదురుమొదురుగా నమోదు
- పూణే ల్యాబ్‌కు జన్యుక్రమ విశ్లేషణ నిమిత్తం 5 నమూనాలు
- జులై ఒకటి నుంచి దేశవ్యాప్తంగా 339 కోవిడ్ కేసుల నమోదు



**అమరావతి,జూలై 17 :** రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్‌లో కరోనా మహమ్మారి మళ్లీ కలకలం రేపుతోంది. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కొత్తగా కోవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదవడంతో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. తక్షణమే అప్రమత్తంగా ఉండాలని జిల్లా అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేసింది.వివరాల్లోకి వెళితే, జూన్ 26వ తేదీ నుంచి జులై 16 వరకు

మిగతా2లో...



## దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

- ఏకంగా 191 మందికి ఉద్యోగ నియామక పత్రాలు
- రవీంద్రభారతి వేదికగా మయంత్రి కొండా సురుఖ అందచేత
- దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నామన్న మంత్రి
- వర్షాల కోసం ఆలయాల్లో వరుణయాగం నిర్వహణకు సంకల్పం

**హైదరాబాద్,జూలై 17 :** దేవాలయం అనేది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వైదిక విజ్ఞానానికి, ధర్మ పరిరక్షణకు కేంద్రంగా నిలిచే పవిత్ర క్షేత్రమని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. అలాంటి దేవాలయాల వైభవాన్ని పరిరక్షించే బాధ్యతను నిర్వర్తించే అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, వాయిద్య కళాకారులు, దేవాలయ వంట సిబ్బంది సేవలు అత్యంత పవిత్రమైనవని మంత్రి సురేఖ పేర్కొన్నారు. ఎంతో అదృష్టం చేసుకుంటేగానీ దేవుని సేవలో తరించే భాగ్యం దక్కదని మంత్రి సురేఖ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో 191 మంది మతపరమైన ఉద్యోగుల నియామక ఉత్తర్వుల అందజేత కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉద్యోగాలు సాధించిన పలువురికి నియామక పత్రాలు అందజేశారు. వీరిలో రాష్ట్రవ్యాప్తంగా 47 ఆలయాలకు ఎంపికైన అర్చకులు, వేదపండితులు, పరిచారకులు, మృదంగం, డోలు, సన్నాయి, శృతి, తాళం తదితర విభాగాలకు చెందిన

మిగతా2లో...

## న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

- రూ.100 కోట్లతో నిధి ఏర్పాటు చేయడం అభినందనీయం
- సుప్రీం చీఫ్ జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసలు



**న్యూఢిల్లీ,జూలై 17 :** న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రశంసించారు. న్యాయవాదుల సంక్షేమ నిధిని రూ.100 కోట్లతో ఏర్పాటు చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. న్యాయవాదుల సంక్షేమానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన అఫిడవిట్‌పై విచారణ సందర్భంగా సీజేఐ

మిగతా2లో...

## 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

- రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



**హైదరాబాద్,జూలై 17 :** రాష్ట్రంలో ఇప్పటి వరకూ సర్ ప్రక్రియ 60 శాతం డిజిటైజేషన్ పూర్తయిందని రాష్ట్ర ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని సుల్తాన్పూర్, ఐలాపూర్, పటాన్ చెరులో బీఎల్వోలు నిర్వహిస్తున్న సర్ శిబిరాలను జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి సుదర్శన్‌రెడ్డి పరిశీలించారు. సర్ ప్రక్రియపై బీఎల్వోలను అడిగి వివరాలు

మిగతా2లో...

# తెలంగాణ కేబినేట్ కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

మంత్రివర్గం నిర్ణయించింది. వివిధ శాఖల అధికారులు, నిపుణులతో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటు చేయాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ధరణిపై దర్యాప్తునకు ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేయడంతో పాటు ధరణి ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు ఫోరెన్సిక్ ఆడిట్ నిర్వహణకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.గ్రామ పంచాయతీల సొంత ఆదాయం పంచాయతీ ఖాతాలోనే జమ చేయాలనే నిర్ణయానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో విద్యా ప్రమాణాలను పెంచేందుకు, విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు వీలుగా పలు కొత్త పోస్టుల భర్తీకి క్యాబినెట్ పచ్చజెండా ఊపింది. అలాగే, పఠాన్‌చెరు నియోజకవర్గ పరిధిలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు అవసరమైన భూమిని కేటాయిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. సాంకేతిక కారణాలు, ప్రయాణికులకు మరింత లబ్ది చేకూర్చేలా బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్ మార్పు ప్రతిపాదనకు కూడా మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఈ క్యాబినెట్ సమావేశంలో గ్రామీణ పల్లెల స్వయంప్రతిపత్తిని బలోపేతం చేసే దిశగా అత్యంత కీలక నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం-2018 సవరణకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా చట్టంలోని సెక్షన్ 70(3)ను సవరించనున్నారు. ఇప్పటివరకు గ్రామ పంచాయతీలకు పన్నులు, ఇతర వనరుల ద్వారా వచ్చే నిధులు, సొంత ఆదాయంప్రభుత్వ ట్రెజరీలో జమ అయ్యేవి. దీనివల్ల అత్యవసర గ్రామ వికాస పనులకు నిధులు డ్రా చేయడం సర్పంచులు లేదా స్థానిక అధికారులకు ఆలస్యమయ్యేది. ఈ ఇబ్బందులను తొలగిస్తూ, ఇకపై గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీతో సంబంధం లేకుండా నేరుగా సదరు గ్రామ పంచాయతీ బ్యాంక్ ఖాతాలోనే జమ చేసుకునేలా చట్ట సవరణకు ఆమోదం లభించింది. దీనివల్ల గ్రామాల్లో అభివృద్ధి పనులు మరింత వేగంగా జరగడానికి వీలవుతుంది. ఈ చట్ట సవరణను తక్షణమే అమలుల్లోకి తీసుకువచ్చేందుకు వీలుగా ప్రభుత్వం త్వరలోనే ప్రత్యేక ఆర్డినెన్స్‌ను జారీ చేయనుంది. ఈ సమావేశంలో దేవాదుల, చిన్న కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ప్రాజెక్టుల అంచనా వ్యయాలను పెంచాలని క్యాబినెట్ నిర్ణయించింది. మరోవైపు, మంత్రిమండలి నిర్ణయంతో సిట్ ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. సిట్ ద్వారా భూ రికార్డుల మార్పులు, అక్రమ మ్యుటేషన్లపై విచారణ చేపట్టాలని భావిస్తోంది. ప్రభుత్వ, అసైన్డ్, వక్ఫ్, దేవాదాయ భూముల లావాదేవీలపైనా ప్రత్యేక దృష్టి సారించనుంది. అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. అవసరమైతే మాజీ అధికారులు, బాధ్యులకు నోటీసులు జారీ చేయాలని భావిస్తోంది. సాంకేతిక అంశాలపై నిపుణుల సహకారంతో దర్యాప్తు చేపట్టాలని నిర్ణయించింది. ధరణి ద్వారా జరిగిన భూ వివాదాలన్నింటిపైనా వివరాల సేకరణకు కసరత్తు చేస్తోంది. అక్రమంగా లబ్ది పొందిన వారిపై కేసులు నమోదు చేయాలని నిర్ణయించింది. ఇందుకు రాష్ట్రవ్యాప్తంగా ఫిర్యాదులు, సంబంధిత పత్రాల పరిశీలనను ప్రారంభించాలని తీర్మానించింది. సిట్ ద్వారా ధరణి అక్రమాలపై వాస్తవాలను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా

# దేవాదాయ శాఖలో అరుదైన ఘట్టం

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగులున్నారు. 191 మంది ఉద్యోగుల నియామకం చేపట్టడం తెలంగాణ దేవాదాయ శాఖ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చారిత్రాత్మక ఘట్టమని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరక్టర్ హనుమంతరావు, ధార్మిక సలహాదారు గోవింద హరి, స్టేట్ ఇన్సిటిట్యూట్ ఆఫ్ టెంపుల్ అడ్మినిస్ట్రేషన్ డైరక్టర్ విజయ రాఘవాచార్యులు, దేవాదాయశాఖ ఆర్‌జెసి రామకృష్ణారావు, డిసి కృష్ణప్రసాద్, ఎడిసి లు శ్రీనివాస్, జ్యోతి, ఎసి రామాల సునీత, తెలంగాణ దేవాదాయ శాఖ అర్చక ఉద్యోగ జాక్ కన్వీనర్ డి.వి.ఆర్.శర్మ, బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, డాక్టర్ ఆర్. శ్రీరామ ఘనాపాటి, కేంద్రమాజీ మంత్రి డాక్టర్ ఎస్. వేణుగోపాలాచారి, పలువురు దేవాదాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి, భక్తులకు నాణ్యమైన సేవలు అందించడానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని తెలిపారు. ఆలయాల్లో ఖాళీగా ఉన్న మతపరమైన పోస్టులను భర్తీ చేయడం ద్వారా నిత్యకైంకర్యాలు, వేదపారాయణాలు, ఉత్సవాలు, ధార్మిక కార్యక్రమాలు మరింత క్రమబద్ధంగా నిర్వహించేందుకు వీలు కలుగుతుందని స్పష్టం చేశారు. అర్చకుల దేవతారాధన, వేదపండితుల వేద పారాయణం, పరిచారకుల నిత్య కైంకర్య సేవలు, ఆధ్యాత్మికశోభను పెంపొందించే మృదంగ వాయిద్య కళాకారులు, దైవానికి నైవేద్యం, భక్తులకు ప్రసాదాన్ని సిద్ధంచేసే వంటవారు తదితర ఉద్యోగులంతా నిష్ఠతో వుంటేనే దేవాలయాల వైభవం, పవిత్రత, ప్రతిష్ఠలు మరింత ఇనుమడిస్తాయని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దేవాలయ ఉద్యోగమంటే ఉపాధి లేదా ఉద్యోగంగా భావించకుండా భగవంతుని సేవ చేసే అరుదైన అవకాశం, ఆధ్యాత్మిక విలువలను పెంపొందించే గొప్ప బాధ్యత అని మీరు భావించాలి. ఈ బాధ్యతను అత్యంత నిబద్ధతతో నిర్వర్తించి భక్తుల విశ్వాసాన్ని నిలబెట్టాలని మంత్రి సురేఖ నియామక ఉత్తర్వులందుకున్న ఉద్యోగులకు సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆయా దేవాలయాలకు ప్రత్యేకంగా భావించే రోజుల్లో ఆధ్యాత్మిక, ధార్మిక, పురాణ ప్రవచనాలు చెప్పే విధంగా త్వరలో ఉత్తర్వులిస్తామని మంత్రి సురేఖ ప్రకటించారు. త్వరలో ఆయా గుళ్ళలో పనిచేసే అన్ని విభాగాల ఉద్యోగస్తులకు పనితీరును బట్టి అవార్డులు ఇస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో ఇప్పటికే సరస్వతి నది ఆది, అంత్య పుష్కరాలను వైభవోపేతంగా నిర్వహించిందని, రాబోయే రోజులు గోదావరి, కృష్ణ నదీ పుష్కరాలను అదే స్థాయిలో నిర్వహిస్తామని మంత్రి సురేఖ స్పష్టం చేశారు. గిరిజన జాతరగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క సారక్క జాతర ప్రాంగణాన్ని అద్భుతంగా తీర్చిదిద్దిన విషయాన్ని గుర్తు చేశారు. ూష్ట్రంలో ఎల్ నినో కారణంగా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని దేవాలయాల్లో వరుణయాగం నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ యాగాల ద్వారా రాష్ట్రంలో సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయా దేవాలయాల్లో పూజలు చేయాలని మంత్రి సురేఖ పిలుపునిచ్చారు. మంత్రి సురేఖని దేవాదాయ ఉద్యోగులు గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

# న్యాయవాదుల సంక్షేమానికి తెలంగాణ కృషి ప్రశంసనీయం

(మొదటి పేజీ తరువాయి)

ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న న్యాయవాదుల సంక్షేమ పథకాల వివరాలను సీజేఐ ధర్మాసనానికి అడ్వకేట్ జనరల్ సుదర్శన్ రెడ్డి వివరించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ద్వారా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వం అఫిడవిట్‌లో పేర్కొంది. కెనరా బ్యాంకులో రూ.100 కోట్ల శాశ్వత కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేశామని, దీనిపై వచ్చే వడ్డీ ద్వారా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని తెలిపింది. అలాగే 2022 నుంచి 2026 వరకు న్యాయవాదుల సంక్షేమ ట్రస్ట్‌కు అదనంగా రూ.7 కోట్ల నిధులను కేటాయించినట్లు వెల్లడించింది. రాష్ట్రంలో సుమారు 50 వేల మంది న్యాయవాదుల కుటుంబాలకు ఉచిత ఆరోగ్య, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వివరించింది. ప్రతి న్యాయవాది కుటుంబానికి రూ.2లక్షల వరకు ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యం అందిస్తున్నామని ప్రభుత్వం పేర్కొంది.

అలాగే ప్రమాదవశాత్తు న్యాయవాది మరణిస్తే ఆ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు రూ.10 లక్షల వ్యక్తిగత ప్రమాద బీమా అమలు చేస్తున్నట్లు తెలిపింది. ఈ బీమా ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే పూర్తిగా భరిస్తోందని, దేశంలో న్యాయవాదుల సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని అఫిడవిట్‌లో పేర్కొంది. కాగా, మహిళా న్యాయవాదులకు కోర్టుల్లో కనీస సదుపాయాలు కల్పించే అంశంపై సమీక్ష నిర్వహించి నివేదిక సమర్పించాలని అడ్వకేట్ జనరల్‌ను సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ ఆదేశించారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారికి అవసరమైన మౌలిక వసతులపై వివరాలు సేకరించాలని సూచించారు. ఈ మేరకు సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ నంబర్ 770/2026 విచారణ సందర్భంగా తెలంగాణ న్యాయశాఖ కార్యదర్శి బి.పాపిరెడ్డి ఈ అఫిడవిట్‌ను సమర్పించారు. ఈ సందర్భంగా న్యాయవాదుల వైద్య అత్యవసరాలు, కుటుంబ భద్రత, ఆర్థిక సహాయానికి తెలంగాణ అడ్వకేట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ నిరంతరం పనిచేస్తోందని అఫిడవిట్‌లో ప్రభుత్వం తెలిపింది. భవిష్యత్తులో మరిన్ని సంక్షేమ పథకాలను విస్తరించే ప్రణాళికలు ఉన్నాయనీ వెల్లడించింది.

# ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

**• అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం • రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు : బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల సమావేశంలో కేటీఆర్**

**హైదరాబాద్, జూలై 17 :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్షౖ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్



ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారా యని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూ ర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

**సభకు అడ్డంకులు సృష్టించే అవకాశం** యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందనీ, అలాంటి ప్రయత్నాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. హైదరాబాద్‌తోపాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి కూడా భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని పార్టీ సీనియర్ నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువజన సభను విజయవంతం చేసేందుకు చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# భారతీయ రైల్వే చరిత్రలో మరో మైలురాయి

(మొదటి పేజీ తరువాయి)

నిదర్శమని కొనియాడారు.ఇదిబొగ్గు, డీజిల్ అవసరం లేకుండా కేవలం హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీతో నడుస్తుంది. ఇది రైలును ముందుకు నడపటానికి హైడ్రోజన్‌ను విద్యుత్తుగా మారుస్తుంది. ఈ ప్రక్రియలో ఉప ఉత్పత్తిగా కేవలం నీటి ఆవిరి మాత్రమే వెలువడుతుంది. దీనివల్ల రైలు నడుస్తున్నప్పుడు కార్బన్ ఉద్గారాలు సున్నాగా ఉంటాయి.పర్యావరణహితంగా 'నమో గ్రీన్‌రైలు' పేరుతో నడిచే ఈ రైలుకు 10 కోచ్‌లు, 3200 హెచ్‌పీ ఇంజిన్ ఉన్నాయి. ఈ రైలు సుమారు గంటకు 110 కి.మీ వేగంతో ప్రయాణిస్తుంది. ఈ రైలులో దాదాపు 2600 మంది ప్రయాణికులు ప్రయాణం చేయవచ్చు. ఈ రైలును చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ నిర్మించింది. దీంతో హైడ్రోజన్ ఆధారిత రైళ్లను నడుపుతున్న ప్రపంచంలో అతికొద్ది దేశాల సరసన భారత్ నిలిచింది.ప్రపంచంలో మొట్టమొదటి హైడ్రోజన్ రైలు జర్మనీలో నడిపారు. ఆ తరువాత జపాన్, చైనా, యూఎస్‌లలో కూడా హైడ్రోజన్ రైళ్లను ప్రారంభించారు.

# రాష్ట్రంలో 12 కొవిడ్ కేసులు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో మొత్తం 12 కరోనా పాజిటివ్ కేసులు వెలుగు చూశాయి. ఈ కేసులను కడప, విశాఖపట్నం, కాకినాడ, గుంటూరు జిల్లాల్లో గుర్తించారు. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే, ఈ కేసుల్లో నలుగురు మరణించినట్లు ఆరోగ్య శాఖ వర్గాలు ధ్రువీకరించాయి. మిగిలిన బాధితుల్లో ముగ్గురు ప్రస్తుతం హోం ఐసోలేషన్‌లో ఉండగా, ఇతరులు వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు.ఈ పరిణామాల నేపథ్యంలో ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. కరోనా లక్షణాలు కనిపించిన వారికి వెంటనే పరీక్షలు నిర్వహించాలని జిల్లా వైద్యాధికారులను ఆదేశించింది. అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అవసరమైన మందులు, టెస్టింగ్ కిట్లు, ఆక్సిజన్ నిల్వలను సిద్ధంగా ఉంచుకోవాలని స్పష్టమైన సూచనలు ఇచ్చింది. ప్రస్తుతానికి కేసుల సంఖ్య తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని అధికారులు సూచిస్తున్నారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్లు తెలిపారు.

# ఉద్యోగులు, పెన్షనర్లకు శుభవార్త

**హైదరాబాద్,జూలై 17 :** తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కాంగ్రెస్ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నగదు రహిత వైద్య సేవల పథకాన్ని ప్రారంభించింది. దీనిని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లాంఛనంగా ప్రారంభించారు. పోర్టల్, డిజిటల్ హెల్త్ కార్డులు, ట్రస్ట్ డీడ్‌ను మంత్రులు ఆవిష్కరించారు. ఈ పథకం ద్వారా మొత్తం 17.88 లక్షల మందికి ఆరోగ్య భద్రత లభించనుంది. రాష్ట్రవ్యాప్తంగా 886 ప్రైవేట్, 114 ప్రభుత్వ ఆస్పత్రుల్లో లబ్దిదారులకి నగదు రహిత చికిత్స పొందే అవకాశం కల్పించారు. అపోలో, యశోద, కిమ్స్, మెడికవర్, కేర్, కామినేని, కాంటినెంటల్, స్టార్, బసవతారకం వంటి కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు పొందొచ్చు. మొత్తం 1,816 వైద్య, శస్త్రచికిత్స ప్యాకేజీలను ఈ పథకం ద్వారా అమలు చేయనున్నారు. ప్రీ-ఆథరైజేషన్ నుంచి కెయిమ్ సెటిల్‌మెంట్ వరకు పక్రియ మొత్తం పూర్తిగా డిజిటల్ విధానంలో కొనసాగనుంది. ఉద్యోగులు, పెన్షనర్ల భాగస్వామ్యంతో ట్రస్ట్ ద్వారా దీన్ని అమలు చేయనున్నారు. ఉద్యోగుల కంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం కూడా వాటా ఇవ్వనుంది. దీని అమలు కోసం రాష్ట్రంలో ప్రస్తుతం 12 వెల్‌నెస్ సెంటర్లు ఉండగా.. త్వరలో మరో 24 వెల్‌నెస్ సెంటర్లు ఏర్పాటు చేయనున్నారు. ఇకపై ప్రతి వెల్‌నెస్ సెంటర్‌ను ప్రభుత్వ జనరల్ ఆస్పత్రితో అనుసంధానం చేయనున్నారు. దీని ద్వారా నాణ్యమైన, పారదర్శక, సుస్థిర వైద్య సేవలను ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులకు అందించే దిశగా తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసినట్లైంది.

# నేడు బిఆర్ఎస్ యువ సంగ్రామ సభ

(మొదటి పేజీ తరువాయి)

స్టేడియంలో సభ నిర్వహించుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు షరతులతో కూడిన అనుమతిని హైకోర్టు ఇచ్చింది. సభ రోజు హైవేను బ్లాక్ చేయొద్దని విచారణ సందర్భంగా ధర్మాసనం ఆదేశించింది. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించొద్దని పేర్కొంది. పోలీసుల సూచనలు పాటించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు రాష్ట్ర యువతకు అనేక హామీలు ఇచ్చారని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు చెబుతున్నారు. ఆ సమయంలో సరూర్‌నగర్ స్టేడియం నుంచే వారు యూత్ డిక్లరేషన్ ప్రకటించారని వెల్లడిస్తున్నారు. నిరుద్యోగ భృతి, జాబ్ క్యాలెండర్, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి ఎన్నో వాగ్దానాలను యువతకు ఇచ్చారని అంటున్నారు. నమ్మించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు వారిని మోసం చేస్తోందని ఆరోపిస్తున్నారు. యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ఇప్పటివరకు అమలు చేయలేదని బీఆర్ఎస్ యువజన విభాగం నేతలు పేర్కొంటున్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ యువ సంగ్రామ సభ ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని గులాబీ నేతలు నిర్ణయించారు. అయితే, ఈ సభకు పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో తెలంగాణ హైకోర్టును బీఆర్ఎస్ నేతలు ఆశ్రయించగా.. తాజాగా వారి సభకు న్యాయస్థానం పచ్చజెండా ఊపింది. ఈ మేరకు శనివారం నిర్వహించే సభకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్దఎత్తున తరలిరావాలని గులాబీ నేతలు పిలుపునిచ్చారు. కాగా, ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

# 60శాతం సర్ డిజిటైజేషన్ పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

తెలుసుకున్నారు. శిబిరాల వద్ద వివిధ పార్టీలకు చెందిన వారు ఉండటాన్ని గమనించి.. మీకు పార్టీ నుంచి గుర్తింపు కార్డులు ఏమైనా ఇచ్చారా? అని ప్రశ్నించారు.

సర్ గడువు పొడిగింపు తేదీని దృష్టిలో పెట్టుకొని పక్రియను కొనసాగించాలని సూచించారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాల్లో 80 శాతం, పట్టణ ప్రాంతాల్లో 45 శాతం అయిందని తెలిపారు. పీఎల్వో, బీఎల్వోల సహకారంతో సర్ పక్రియ కొనసాగుతోందన్నారు. ఎన్యూమరేషన్ పత్రాలు అందకపోతే.. సూపర్ వైజర్‌లను అడిగి తీసుకోవాలన్నారు.

# నీటి సంపులో దూకి తల్లీ బిడ్డల ఆత్మహత్య

**నాగర్‌కర్నూల్ ,జూలై 17 :** నాగర్‌కర్నూల్ జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యకు పాల్పడింది. వెల్దండ మండలం పోతేపల్లిలో ఈ ఘటన జరిగింది. ఎనుముల శిరీష (23) తమ ఇంటి ఆవరణలో ఉన్న నీటి సంపులో కుమార్తె మానశ్రీ (3), కుమారుడు వర్షిత్ (4 నెలలు)ను పడేసి.. ఆపై తానూ అందులోకి దూకేసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పిల్లలతో కలిసి శిరీష బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. కుటుంబ కలహాలే ఈ ఘటనకు కారణంగా తెలుస్తోంది.

నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
శనివారం, జూలై 18, 2026



## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలి కలెక్టర్ భవేశ్ మిశ్రా



**ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** 2027లో జరగనున్న గోదావరి నది పుష్కరాలకు ఇప్పటినుంచే తగిన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా రోడ్డు సౌకర్యాలు, ఘాట్ల వద్ద పుణ్యస్నానాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలో పర్యటించిన కలెక్టర్, పుష్కర ఘాట్లను పరిశీలించారు. పట్టణంలో జరుగుతున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ పనులను కూడా పరిశీలించి, గడువులోగా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. అర్హులైన ఓటర్లు తమ హక్కు కోల్పోకుండా పారదర్శకంగా నమోదు చేయాలని, బూత్ లెవెల్ అధికారులు ప్రజలకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ సుజాత, ఎంపీడీవో రాధా రాథోడ్, మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ సోయబ్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

## లాంగ్ ఆబ్సెంట్ విద్యార్థుల కోసం ఉపాధ్యాయుల వేట



**ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పాత ఎల్లాపూర్ ఉపాధ్యాయులు శుక్రవారం దీర్ఘకాలంగా పాఠశాలకు రాని విద్యార్థులను వెతికేందుకు గోసంపల్లె, గోడలపంపు, వడ్డేవాడ గ్రామాలకు వెళ్లారు. కొద్దిమంది మాత్రమే దొరకగా, కొందరు ఉపాధ్యాయులను చూసి పారిపోతున్నారని ఉపాధ్యాయుడు జోగు శ్రీనివాస్ తెలిపారు. లాంగ్ ఆబ్సెంట్ విద్యార్థులను రెగ్యులర్‌గా పాఠశాలకు రప్పించి హాజరు శాతం 100శాతం సాధిం చాలని జిల్లా, రాష్ట్ర ఉన్నత విద్యాధికారులు ప్రతిరోజూ ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. హాజరు లేని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు టార్గెట్ ఇస్తున్నారని తెలి పారు. తల్లిదండ్రులు పిల్లలను పనికి పంపకుండా పాఠశాలకు పంపాలని ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పలకలు, నోటుబుక్కులు పంపిణీ



**ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఖానాపూర్ మండలంలోని రాజు రా ప్రాథమిక పాఠశాలలో ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పలకలు, నోటుబుక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజల ఉపాధ్యాయులు కార్గం ప్రవీణ్ మాట్లాడుతూ, పలకలు, నోటుబుక్కులు ఇదే గ్రామానికి చెందిన వడ్ల శ్రీధర్ విరాళంగా అందజేశారని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని శ్రీధర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లేష్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సునీల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతి



**ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దిలావర్పూర్ గ్రామంలో చేపట్టిన పనుల బిల్లులు మూడు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని త్వరగా మం జూరు చేయాలని సర్పంచ్ చింతల మల్లేష్, ఉపసర్పంచ్ ఓరగంటి రాజేశ్వర్, గుగ్గిల్ల సంతోష్ గౌడ్ శు క్రవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రాకు వినతిపత్రం అందజే శారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సీసీ రోడ్లు, డ్రైనేజ్ పనులు చేసినప్పటికీ నిధులు విడుదల కాలేదని, అప్పుల పాలవుతున్నామని వారు తెలిపారు. ఎస్‌డిఎఫ్ ఫండ్ కింద బిల్లులు త్వరగా మంజూరు చేయాలని కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం అధ్యక్షుడు కారోబార్ పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో ఉపాధ్యాయుల నూతన ఒరవడి



**ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నిర్మల్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న సామాజిక శాస్త్ర ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పర్యావరణ పరిరక్షణకు కొత్త మార్గాన్ని చూపించారు. భోజనం, చాయ్ కోసం ప్లాస్టిక్ వాడకాన్ని నిరోధిస్తూ, తమ స్వంత స్టీల్ ప్లేట్లు, గ్లాసులు తెచ్చుకుని వినూత్న సందేశం ఇచ్చారు. మొదట ముగ్గురు--నలుగురితో ప్రారంభమైన ఈ ప్రయత్నం శిక్షణ ముగిసే వరకు మరింత మంది ఉపాధ్యాయులను ఆకర్షించింది. విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణను బోధించే ఉపాధ్యాయులే స్వయంగా ఆచరించడం అందరి అభినందనలకు పాత్రమైంది. హిందీ ఉపాధ్యాయులు కూడా ఈ ప్రయత్నంలో భాగమయ్యారు. అధికారులు ఉపాధ్యాయుల ఈ చర్యను ప్రశంసిస్తూ, ప్రతి కార్యక్రమంలో స్టీల్ పాత్రలు వాడాలని సూచించారు.

# నూతన బాధ్యతలు స్వీకరించిన అధికారులను మర్యాదపూర్వకంగా కలిసిన టీఎన్జీవో నాయకులు

**కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లాలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ల్యాండ్ అక్విజిషన్) ఎల్. రాజేశ్వరి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డిప్యూటీ డైరెక్టర్ పెద్దిరెడ్డి భాగ్యలక్ష్మిని టీఎన్జీవోలు సంఘం ప్రతినిధులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా అధ్యక్షుడు, ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన అధికారులకు శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు. అధికారులు ప్రజలకు సమర్థవంతమైన సేవలు అందించాలని సంఘం నాయకులు ఆకాంక్షించారు. దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అధికారులు, ఉద్యోగులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే ప్రభుత్వ సంక్షేమ పథకాలు మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరుతాయని తెలిపారు. ఉద్యోగుల





సమస్యలను సానుకూల దృక్పథంతో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అధికారులు స్పందిస్తూ ఉద్యోగుల సమస్యలను సానుభూతితో పరిశీలించి, చట్టబద్ధమైన అంశాల్లో సహకరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీచరణ్, టీఎన్జీవోలు జిల్లా కార్యదర్శి సంగేం లక్ష్మణరావు, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, మహిళా విభాగం జిల్లా చైర్‌పర్సన్ ఇరుమల్ల శారద, పట్టణ సంఘం అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, పట్టణ కార్యదర్శి వెలిచాల సుమంత్ రావు, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, జిల్లా కార్యదర్శి శంకర్, ఇతర నాయకులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర నిధులతో గ్రామాల అభివృద్ధి

### - మంత్రి బండి సంజయ్

**రాజన్న సిరిసిల్ల, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గ్రామ పంచాయతీల అభివృద్ధి అంతా కేంద్ర నిధులతోనే జరుగుతోందని, రాష్ట్ర ప్రభుత్వం ఇందుకోసం ఒక్క పైసా కూడా ఇవ్వలేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం పొన్నాలపల్లిలో ఆర్జీఎస్ఏ కింద కేంద్రం కేటాయించిన రూ.20 లక్షలు, రాష్ట్రం ఇచ్చిన రూ.5 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత 12 ఏళ్లలో మోదీ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి రూ.లక్ష కోట్లకుపైగా ఖర్చు చేసిందని తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద చెరువుల పునరుద్ధరణ, సీసీ రోడ్లు, వైకుంఠ ధామాలు నిర్మాణానికి రూ.40 వేల కోట్లు, గ్రామీణ



రోడ్లకు రూ.11 వేల కోట్లు, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ నీటి సరఫరాకు రూ.10 వేల కోట్లు ఖర్చు చేశారని వివరించారు. పల్లె ప్రకృతి వనాలు, రైతు భరోసా కేంద్రాలు, అంగన్‌వాడీ భవనాలు అన్నీ కేంద్ర నిధులతోనే సాధ్యమ య్యాయని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర నిధులను



సిబ్బంది జీతాలు, శానిటేషన్ ఖర్చులకు మళ్లిస్తోందని ఆయన మండిపడ్డారు. గ్రామాల అభివృద్ధితోనే దేశ ప్రగతి సాధ్యమని నమ్మే మోదీ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపీ, స్థానిక నాయకులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# వినాయక ఉత్సవాల నిర్వహణపై పోలీసులు విధించిన ఆంక్షలపై గంగుల ఆగ్రహం

**కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలో గణపతి నవరాత్రి ఉత్సవాల నిర్వహణపై పోలీసులు విధించిన ఆంక్షలపై ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ తీవ్రంగా స్పందించారు. సప్తగిరి కాలనీలో వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతులు నిరాకరించడంతో ఆయన శుక్రవారం అక్కడ పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 38 ఏళ్లుగా ప్రజలు గణపతి, దుర్గానవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారని, ఇప్పుడు మండపాలు పెట్టవద్దని చెప్పడం సమంజసం కాదని విమర్శించారు. పోలీసులు ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపి ంచారు. బొమ్మకల్ హనుమాన్ విగ్రహం చోరీ ఘటనను ప్రస్తావిస్తూ, విగ్రహాన్ని వెతికి ప్రతిష్ఠించిన తనపై కేసులు నమోదు చేయడం



విడ్డూరమని అన్నారు. దేవుని విగ్రహాలను కాపాడుకోవాల్సిన దుస్థితి రావడం పోలీసుల అసమర్థతకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. తన క్యాంపు కార్యాలయంపై బీజేపీ శ్రేణులు దాడి చేసినప్పుడు వారిపై కేసులు నమోదు చేయకుండా రాజమర్యాదలు చేసినట్లు ఆరోపించారు. కరీంనగర్‌లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీస్ కమిషనర్‌దేనని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి, కరీంనగర్ పోలీసు వ్యవస్థను గాడిన పెట్టాలని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని గంగుల డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గౌరవెల్లి ప్రాజెక్టుపై కాంగ్రెస్ నిర్లక్ష్యం బీఆర్ఎస్ ఆరోపణలు

**హుస్నాబాద్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుస్నాబాద్ మెట్ట ప్రాంత రైతులకు సాగు నీరు అందించాలనే ఉద్దేశంతో మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి గౌరవెల్లి గండిపల్లి ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసినా, ఆ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ ఆధ్వర్యంలో 98 శాతం పనులు పూర్తయ్యాయని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత మూడు సంవత్సరాలు గడిచినా ఒక్క అడుగు ముందుకు వేయలేదని వారు ఆరోపించారు. వరద కాలువలు పూర్తి కాకపోవడంతో రైతులకు సాగు నీరు అందడం లేదని, ప్రాజెక్టు పనులపై మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక శ్రద్ధ చూపకపోవడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో భూములు కోల్పోయిన వందలాది రైతులకు నష్టపరిహారం అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం కనీసం 40 మందికి కూడా పరిహారం ఇవ్వలేదని విమర్శించారు. ఇక మిగిలిన రెండు



సంవత్సరాల్లో ప్రాజెక్టు పనులు పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, లేకుంటే కాంగ్రెస్ పార్టీకి రైతులు తగిన తీర్పు ఇస్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు సూద్దాల చంద్రయ్య, అయిలేని మల్లికార్జున రెడ్డి, మేదీని వెంకట్ స్వామి, యాస శ్రీనివాస్, ఇంద్రాల సారయ్య, అయిలేని గాల్ రెడ్డి, గూగులోతు తిరుపతి నాయక్, ఇరుగు రమేష్, నాంపల్లి శంకర్, మాటూరి రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# గణేష్ ఉత్సవాలపై బీఆర్ఎస్ రాజకీయాలు

## డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు

**కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ నగరంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలను రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ పార్టీ, స్థానిక ఎమ్మెల్యే వివాదాస్పదంగా మార్చే ప్రయత్నం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు తీవ్రంగా ఖండించారు. మిత్ర యూత్ ఆధ్వర్యంలో అఖిల్ గౌడ్ బృందం గత 30 ఏళ్లుగా గణేష్ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారని, పర్యావరణ పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధతో మట్టి వినాయకుడిని ప్రతిష్ఠించడం వారి ప్రత్యేకత అని ఆయన గుర్తు చేశారు. పవిత్రమైన పండుగ వాతావరణంలో రాజకీయాలు చేయడం దిగజారుడు చర్య అని విమర్శించారు. ప్రధాన మండపానికి కేవలం 10--15 అడుగుల దూరంలో కొత్త మండపం ఏర్పాటు చేయడం కవ్వింపు చర్య అని, దీనివల్ల అన్నదాన కార్యక్రమాలు, భక్తుల రద్దీ, వాహనాల పార్కింగ్‌కు అంతరాయం కలుగుతుందని తెలిపారు. పోలీసు యంత్రాంగం



వెంటనే జోక్యం చేసుకొని కొత్త మండపాలు తగిన దూరంలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. బీజేపీ నాయకత్వంలో కరీంనగర్‌లో పార్టీ బలమైన శక్తిగా ఎదిగిందని, గణేష్ ఉత్ స్వాలను ప్రశాంతంగా, ఘనంగా నిర్వహించేందుకు సంపూర్ణ మద్దతు ఇస్తుందని సునీల్ రావు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో బీజేపీ కార్పొరేటర్లు కే.ఏపీపీ చంద్ర, పొన్నం లక్ష్మి, బండ రమణారెడ్డి, తోట అనిల్ కుమార్, నాయకులు బండారి గా యత్రి, గడప నాగరాజు, శివకుమార్, మిత్ర యూత్ అధ్యక్షుడు కోడూరి అఖిల్ గౌడ్ మరియు వారి బృందం పాల్గొన్నారు.

# ఫోర్‌లైన్ పనులు వేగవంతం చేయాలి కలెక్టర్ చిత్రా మిశ్రా



తిమ్మాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): కొత్తపల్లి నుంచి హుస్నాబాద్ వరకు ఫోర్‌లైన్ రహదారి నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి, చిగురుమామిడి, ముల్కనూరు ప్రాంతాల్లో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పర్యటించి రహదారి అలైన్‌మెంట్, భూసర్వే పనులను పరిశీలించారు. ఫేజ్-1 కింద కొత్తపల్లి నుంచి సుందరగిరి వరకు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రోడ్డు నిర్మాణంలో నివాస గృహాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందా, ప్రత్యామ్నాయ బైపాస్ మార్గాల ఏర్పాటు సాధ్యమా అనే అంశాలపై సమగ్ర అధ్యయనం చేయాలని ఆదేశించారు. అవసరమైతే గ్రామసభలు నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ప్రజా ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రహదారి పనులు చేపట్టాలని, అభివృద్ధి పనులు ప్రజల ఇళ్లకు, జీవన విధానానికి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, ఆర్ అండ్ బి డీఈ కిరణ్, ఏఈ సురేష్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మార్కెట్ యార్డులో సెంట్రలైజ్డ్ కిచెన్ పనుల పరిశీలన



కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన అల్పాహారం, పాలు అందించేందుకు హరే రామ హరే కృష్ణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్ ప్రధాన మార్కెట్ యార్డులో ఏర్పాటు చేస్తున్న సెంట్రలైజ్డ్ కిచెన్ పనులను జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ప్రతినిధులు, మార్కెట్ అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వం కేటాయించిన స్థలంలోనే కిచెన్ షెడ్డు ఏర్పాటు పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, మార్కెట్ చైర్మన్ ఆకుల నరసయ్య, మార్కెట్ సెక్రటరీ సయ్యద్ హమీద్, అధికారులు పాల్గొన్నారు.

## డిజిటలైజేషన్ దిశగా జిపిఎఫ్, పింఛన్ సేవలు



కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ప్రభుత్వ ఉద్యోగుల జనరల్ ప్రావిడెంట్ ఫండ్, పింఛన్ సేవల్లో నాణ్యత, వేగవంతం పెంచేందుకు పూర్తి డిజిటలైజేషన్ దిశగా ముందుకు వెళుతున్నామని తెలంగాణ రాష్ట్ర ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ చందా పండిత్ తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రవ్యాప్త అదాలత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు విరమణ చేసిన వెంటనే ఆర్థిక ప్రయోజనాలు అందేలా ప్రతిపాదనలు మూడు నెలల ముందే సిద్ధం చేసి పంపాలని సూచించారు. డీడీవోలు ఆడిట్ నియమ నిబంధనలపై అవగాహన కలిగి, ప్రతిపాదనల్లో తప్పులు లేకుండా చూడాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా పేరుకుపోయిన జిపిఎఫ్, పింఛన్ సమస్యల పరిష్కారం కోసం అన్ని జిల్లాల్లో అదాలత్ వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే పోలీస్, అటవీ శాఖల్లో సమస్యలు పరిష్కరించామని తెలిపారు. భవిష్యత్తులో అన్ని సేవలను పూర్తిగా డిజిటలైజేషన్ చేయనున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, సీనియర్ డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ నరేష్ కుమార్, డిప్యూటీ అకౌంటెంట్ జనరల్ అభయ్ అనిల్ సోనార్కర్, జిల్లా ట్రెజరీ అధికారి నాగరాజు, కలెక్టరేట్ ఏవో సుధాకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కోతుల బెడదపై ప్రజల ఆగ్రహం



హుస్నాబాద్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హుస్నాబాద్ పట్టణంలో కోతుల బెడద పెరిగి మహిళలు, కుటుంబాలపై దాడులు జరుగుతున్నా మున్సిపల్ పాలకవర్గం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని హుస్నాబాద్ డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షుడు కవ్వ వేణుగోపాల్ రెడ్డి విమర్శించారు. ఆరు లక్షలు ఖర్చు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడం అవినీతి పాలనకు నిదర్శనమని ఆయన ఆరోపించారు. పట్టుకున్నవి 60 కోతులే కానీ ప్రచారం మాత్రం కొండంతగా చేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మున్సిపాలిటీ పాలనను గమనించి, కోతుల సమస్యను పూర్తిగా నివారించకుంటే మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని, వంట వార్పు కూడా అక్కడే నిర్వహిస్తామని వేణుగోపాల్ రెడ్డి హెచ్చరించారు.

## జూలై 31లోపు రేషన్ కార్డుల ఈ-కేవైసీ పూర్తి చేయాలి



సిద్ధిపేట, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): రేషన్ కార్డుదారులందరూ ఈ నెల 31లోపు తప్పనిసరిగా ఈ-కేవైసీ పూర్తి చేయాలని జిల్లా పౌరసరఫరాల అధికారి తనూజ విజ్ఞప్తి చేశారు. జిల్లాలో మొత్తం 10,47,075 మంది లబ్ధిదారుల్లో ఇప్పటివరకు 8,48,446 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారని, ఇది 81.03 శాతం అని తెలిపారు. కొన్ని కుటుంబాల్లో సభ్యులందరూ కాకుండా ఒకరు లేదా ఇద్దరు మాత్రమే పూర్తి చేసినట్లు గుర్తించామని, మిగిలిన వారు వెంటనే పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ఆహార ధాన్యాల పంపిణీ నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ-కేవైసీ తప్పనిసరి అని, ఇంకా పూర్తి చేయని వారు తమ సమీప చౌకధరల దుకాణాన్ని సంప్రదించాలని తనూజ విజ్ఞప్తి చేశారు.

# రీ సర్వే పనులు పకడ్బందీగా పూర్తి చేయాలి - కలెక్టర్ చిత్రా మిశ్రా



హుస్నాబాద్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, ఖచ్చితత్వంతో నిర్వహించి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం తిమ్మాపూర్ మండలం కొత్తపల్లి గ్రామంలో నాన్ కడాస్ట్రల్ రీ సర్వే, చిగురుమామిడి మండలం ఉల్లంపల్లి గ్రామంలో ఎంజాయ్‌మెంట్ రీ సర్వే పనులను ఆమె పరిశీలించారు. ఇప్పటివరకు పూర్తయిన విస్తీర్ణం, మిగిలిన పనులు, వాటి గడువు వివరాలను తెలుసుకున్నారు. గ్రామ సరిహద్దులను ఆధునిక సాంకేతిక పరికరాలతో నిర్ధారించి, రైతుల వారీగా భూముల సర్వే నిర్వహించాలని సూచించారు. సర్వే పూర్తైన తర్వాత భూ వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని తెలిపారు. కరీంనగర్ జిల్లాలో తొలి విడతగా 70 గ్రామాల్లో రీ సర్వే చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించగా, ప్రస్తుతం ఏడు గ్రామాల్లో పనులు కొనసాగుతున్నాయని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ షర్మిల, తహసీల్దార్లు శ్రీనివాస్ రెడ్డి, కనకయ్య, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలి

**- డీఈఓ చైతన్య జైని**



కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): హైస్కూల్ స్థాయి విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించి, అభ్యసన ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి చైతన్య జైని సూచించారు. స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో తెలుగు, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయులకు మూడు రోజుల ఇంటిగ్రేటెడ్ శిక్షణ కార్యక్రమాన్ని ఆమె శుక్రవారం సందర్శించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పాఠశాలలో అమలు చేసి విద్యార్థుల అభ్యసన స్థాయిని మెరుగుపరచాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. తరగతి గది బోధనను ఆకర్షణీయంగా మార్చడంలో సాంకేతికత కీలకమని, ప్రణాళికాబద్ధమైన పాఠ్య బోధన ద్వారా విద్యార్థులు ఆసక్తిగా నేర్చుకుంటారని తెలిపారు. ఐసీటీ, కృత్రిమ మేధ, పిల్లల భద్రత, సమ్మిళిత విద్య, హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డ్స్, రెమెడియల్ టీచింగ్ వంటి అంశాలను పాఠశాలలో అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరియల్ అధికారులు, సెంట్రల్ ఇన్‌చార్జ్‌లు, రిసోర్స్ పర్సన్స్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నీట్ 2026లో అల్ఫోర్స్ విద్యార్థుల ఘన విజయం




కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నీట్--2026 ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యార్థులు చారిత్రాత్మక విజయాన్ని సాధించారు. పట్టుదలతో కృషి చేస్తే విజయం సాధ్యమని నిరూపిస్తూ, జాతీయస్థాయిలో అత్యధిక మార్కులు సాధించారు. డి. రిత్విక్ 647 మార్కులతో అగ్రస్థానంలో నిలువగా, సిద్దాంత్ చతుర్వేది 564, సయ్యద్ మలాజుద్దీన్ 557, వసుల శ్రుత్విక 551, గులామ్ మహమ్మద్ హుస్సేన్ 548, బత్తుల అభిజ్ఞ 541, లింగంపల్లి అనంత్ సాయి 540, నార్ల శ్రీహిత 538, శ్రేయాంశ్ ద్వివేది 537, కొండ్ల అక్షిత 522, బొమ్మవరపు రుత్విక్ 515, జక్కుల శ్రీవైత్రి 512, హర్షిత 509, సాత్విక 508, సత్య బ్రాహ్మిణి 507, అక్షర 505, నిద 502, గుంజేటి రిషిత 501, జహ్రా మాజీద్ 501 మార్కులు సాధించారు. 500 మార్కుల పైగా 19 మంది విద్యార్థులు రాణించడం విశేషం. సుమారు 100 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. 'డాక్టర్స్ 30' ప్రత్యేక ప్రోగ్రామ్ ద్వారా అందించిన కోచింగ్, పటిష్ట ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదలతో ఈ ఘన విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. తక్కువ మంది విద్యార్థులతో అధిక సీట్లు సాధించడం అల్ఫోర్స్ విజయాలకు నిదర్శనమని తెలిపారు. రాబోయే కాలంలో మరింత మంది విద్యార్థులను మెడికల్, ఐఐటి, ఎన్ఐటీలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దుతామని, విజయానికి తోడ్పడిన అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు.

## జర్నలిస్టుపై దాడిని ఖండించిన అఖిలపక్ష నాయకులు




పెద్దపల్లి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జర్నలిస్టుపై దాడి చేసిన నిందితులపై అధికార పార్టీ ఒత్తిళ్లకు లొంగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని పెద్దపల్లి జిల్లా అఖిలపక్ష నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ, సుమన్ టీవీ ప్రతినిధి శ్రీకాంత్‌పై ప్రభుత్వ ఆసుపత్రి ఔట్సోర్సింగ్ సిబ్బంది దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టులు నిర్భయంగా తమ విధులు నిర్వహించే హక్కు కలిగి ఉన్నారని, వారిపై దాడులు జరగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి బాధితుడికి న్యాయం చేయాలని, జర్నలిస్టుల భద్రతకు ప్రభుత్వం హామీ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. మీడియాపై దాడులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు ఉప్పు రాజ్‌కుమార్, తెలంగాణ రక్షణ సేన నాయకులు సుభాష్, ప్రేమ్, మిట్టపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మినీ ట్యాంక్ బండ్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే విజయరమణ రావు



పెద్దపల్లి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బందంపల్లి వద్ద రూ.3 కోట్లతో నిర్మించబోయే మినీ ట్యాంక్ బండ్ పనులను ప్రభుత్వ విప్, పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణ రావు మున్సిపల్ చైర్మన్, సంబంధిత అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. విజయరమణ రావు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెద్దపల్లి ప్రజలు ఆహ్లాదకరంగా గడిపేందుకు మినీ ట్యాంక్ బండ్ నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. చెరువు కట్ట మరింత సుందరంగా ఉండేందుకు తీగల వంతెన కూడా నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. పనులను నాణ్యతతో చేపట్టాలని, ఎలాంటి రాజీ లేకుండా పూర్తి చేయాలని గుత్తేదారులకు సూచించారు. పెద్దపల్లి పట్టణాన్ని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నామని ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నూ గిల్లా మల్లయ్య, మున్సిపల్ కమిషనర్ ఆకుల వెంకటేష్, స్థానిక కౌన్సిలర్ పురేళ్ల శైలజా సుధాకర్, ఇరిగేషన్ అధికారులు, పట్టణ కౌన్సిలర్లు, పలు గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో హరితహారం



ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పాత ఎల్లాపూర్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం హరితహారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తమ ఇంటిలో మొక్కలు నాటాలని, తల్లిదండ్రులను కూడా ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి ఇంటిలో మొక్కలు నాటితే గ్రామం నిండా చెట్లు పెరిగి పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. విద్యార్థులు నాటిన మొక్కలను పెరిగే వరకు కాపాడే బాధ్యత తీసుకోవాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 25 మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు నెహరు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటరు సవరణపై పరిశీలన



జగిత్యాల, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): జగిత్యాల పట్టణంలోని 42వ వార్డులో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం అమలు తీరును బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. బోగ శ్రావణి, వార్డ్ కౌన్సిలర్ నిమ్మల నాగరాజుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డా. బోగ శ్రావణి మాట్లాడుతూ, పట్టణంలో ఓటరు సవరణ ప్రక్రియ ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి కోసం వచ్చిన కార్మికులు, ఉద్యోగులు సాయంత్రం తర్వాతే ఇంటికి చేరుకుంటారని, అందువల్ల బిఎల్‌ఏలు సాయంత్రం వేళల్లో కూడా అందుబాటులో ఉండి ఓటర్లను కలిసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలా చేస్తే అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి నమోదు చేసే అవకాశం పెరుగుతుందని, ఓటర్ల మ్యాపింగ్ సమర్థవంతంగా పూర్తవుతుందని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటరు జాబితా అత్యంత కీలకమని, ఎన్నికల సంఘం అధికారులు, రాజకీయ పార్టీలు బాధ్యతతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 5వ వార్డ్ కౌన్సిలర్ వేముల శ్రీనివాస్, 49వ వార్డ్ కౌన్సిలర్ సిరిపురం శ్రీలత శ్రీనివాస్, అముద రాజు, గదాసు రాజేందర్, గట్ల శ్రీనివాస్, బద్దెల గంగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగిపై వేధింపులను ఖండిస్తున్న సిపిఐ



కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): మున్సిపల్ కార్యాలయంలో మహిళా ఉద్యోగిని లైంగికంగా వేధిస్తున్నారని ఆరోపణలు రావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోందని సిపిఐ నాయకులు పేర్కొన్నారు. ఈ ఉద్యోగులను వెంటనే సస్పెండ్ చేసి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం నగర మేయర్ కొలగాని శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేసిన సిపిఐ నాయకులు, కార్యాలయంలో అసభ్యకర ప్రవర్తన, బెదిరింపులు మహిళలకు భద్రతా లోపాన్ని చూపిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటనలు బయటకు వస్తే ప్రజలు కార్యాలయానికి రావడానికి కూడా భయపడతారని తెలిపారు. మేయర్ స్పందిస్తూ మహిళా అధికారులతో కమిటీ ఏర్పాటు చేశామని, రిపోర్ట్ రెండు రోజుల్లో వస్తుందని, అందిన వెంటనే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బ్రాహ్మణపెల్లి యుగంధర్, జువ్వాజి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఆషాడమాసం ఉత్సవాల భాగంగా దుర్గాభవానీ అమ్మవారికి పండ్ల అలంకరణ



కరీంనగర్ రూరల్ మండలం, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్): ఆషాడమాసం శాకంబరీ ఉత్సవాల భాగంగా కరీంనగర్ నగునూర్‌లోని శ్రీదుర్గాభవానీ ఆలయంలో మూడవ రోజు శుక్రవారం అమ్మవారిని వివిధ పండ్లతో అలంకరించారు. ఆలయ ప్రధానార్చకుడు పవనకృష్ణ శర్మ విశేష హారతులు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మన్, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారి దర్శనం పొందారు.

## ఉద్యోగుల ఆరోగ్య పథకం చారిత్రక నిర్ణయం




**ఖానాపూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఉపాధ్యాయులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల కోసం ప్రవేశపెట్టిన ఉద్యోగుల ఆరోగ్య పథకం చారిత్రక నిర్ణయమని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం నిర్మల్ జిల్లా అధ్యక్షుడు ఎస్. భూమన్న యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉంటేనే భవిష్యత్తు భారతాన్ని నిర్మించగలరని భూమన్న యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన, ఎస్టీయూటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సదానందం గౌడ్‌ను పుష్పగుచ్ఛంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జుట్టు గజేందర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## యూట్యూబర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్




**పెద్దపల్లి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తమపై యూట్యూబర్ సోమ శ్రీకాంత్ చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమని, డబ్బులు డిమాండ్ చేసి బెదిరింపులకు పాల్పడిన ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఔట్‌సోర్సింగ్ పేషెంట్ కేర్ సిబ్బంది డిమాండ్ చేశారు. జిల్లా ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ, మయూర బార్ అండ్ రెస్టారెంట్‌లో తమ అనుమతి లేకుండా వీడియోలు, ఫొటోలు తీసి, డబ్బులు ఇవ్వకపోతే సోషల్ మీడియాలో ప్రచారం చేస్తామని బెదిరించారని ఆరోపించారు. సమస్యను చర్చించేందుకు రబ్బాని టీ స్టాల్ వద్ద సమావేశమైనప్పుడు వాగ్వాదం చోటుచేసుకుందని, ఈ సమయంలో కులం పేరుతో దూషణలు జరిగాయని తెలిపారు. డబ్బులు డిమాండ్ చేయడం, బెదిరింపులు, కులం పేరుతో అవమానించడం వంటి చర్యలకు బాధ్యులైన యూట్యూబర్‌పై అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సమావేశంలో జక్కుల రాకేష్, జంగా కుమార్, ముక్కెర రాజేందర్, కుమార్ యాదవ్, ఎల్పుల అనిల్, కందుల అఖిల్, కొండి సతీష్, పెదిపల్లి సాయిరాం, శేఖర్, క్యాతం శివ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

## అల్ఫోర్స్ విద్యార్థుల జిల్లా కోర్ట్ పర్యటన



**కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ 8, 9వ తరగతి విద్యార్థులు జిల్లా కోర్టును సందర్శించారు. పాఠశాల నిర్వాహకులు విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించి, క్షేత్ర పర్యటనల ద్వారా విషయాలపై విస్తృతమైన అవగాహన వస్తుందని, సామాజిక న్యాయం పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. కోర్టు పర్యటనలో విద్యార్థులు న్యాయవాదులను పలకరించి, ప్రపంచ న్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు సామాజిక అంశాలపై చక్కటి కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్, ఉపాధ్యక్షుడు మంద శివకుమార్, బార్ అసోసియేషన్ సభ్యులు, పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎస్సీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల కీలక సమావేశం



**మానకొండూర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్‌లోని దిల్ ఖుషా గెస్ట్ హౌస్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎస్సీ సామాజికవర్గ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలతో టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డా. కవ్వంపల్లి సత్యనారాయణ శుక్రవారం కీలక సమావేశం నిర్వహించారు. తాజాగా మాదిగ ఎమ్మెల్యేల బృందం ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ నేతలను కలిసిన నేపథ్యంలో రాష్ట్ర క్యాబినెట్ విస్తరణలో మాదిగ వర్గానికి అవకాశం కల్పించాలని సమావేశం డిమాండ్ చేసింది. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు, ప్రభుత్వ పథకాల అమలు, నియోజకవర్గ సమస్యలు, పార్టీ బలోపేతం వంటి అంశాలపై చర్చ జరిగింది. కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్సీ సంక్షేమం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో పనిచేస్తోందని తెలిపారు. ఎస్సీ వర్గాల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీ వర్గాల సాధికారత కోసం సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మేడిపల్లి సత్యం, వేముల వీరేశం, కాలె యాదయ్య, నాగరాజు, శ్రీగణేష్, ఆర్. సంపత్ కుమార్, సామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణలో కాంగ్రెస్ బీఎల్‌ఏల పాత్ర కీలకం



**జగిత్యాల, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజ్యాంగం కల్పించిన విలువైన ఓటు హక్కును అర్హులైన ప్రతి పౌరుడు పొందాల్సిన అవసరం ఉందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్య అన్నారు. శుక్రవారం జగిత్యాల మండలంలోని పోలాస గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏలు, పార్టీ నాయకులతో మాట్లాడి, ఓటు హక్కుకు అర్హులైన వారు జాబితా నుంచి తొలగిపోకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా కృషి చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా వెంటనే పరి ష్కరించేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అందుబాటులో ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. రాజ్యా ంగబద్ధమైన ఓటు హక్కును కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నందయ్య పేర్కొ న్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు, బీఎల్‌ఏలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్స్, గురుకుల, సమగ్ర శిక్ష టీచర్లకు కూడా ఆరోగ్య పథకం వర్తింపచేయాలి - టిపిటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి



**హైదరాబాద్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నెబోయిన తిరుపతి నూతన ఆరోగ్య పథకం అమలుపై కీలక సూచనలు చేశారు. ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క మల్లు రాష్ట్ర సచివాలయంలో కొత్త ఆరోగ్య పథకాన్ని ప్రారంభించడాన్ని టిపిటిఎఫ్ స్వాగతి స్తున్నామని ఆయన తెలిపారు. ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌కు సమానంగా ప్రభుత్వం ప్రతినెలా గ్రాంటు జమ చేయాలని, చికిత్స ఖర్చులను వెంటనే ఆసుపత్రులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. మోడల్ స్కూల్స్, గురుకుల, సమగ్ర శిక్షలో పనిచేస్తున్న టీచర్లు, ఉద్యోగులకు కూడా ఈ పథకం వర్తించాలన్నది ఆయన ప్రధాన డిమాండ్. “అందరి ఆరోగ్యం చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే” అని స్పష్టం చేశారు. భవిష్యత్తులో ఉద్యోగుల కాంట్రిబ్యూషన్‌ను క్రమంగా తగ్గించి, పూర్తిస్థాయిలో ప్రభుత్వమే గ్రాంటు కేటాయించి, ఉచిత ఆరోగ్య పథకాన్ని అమలు చేసేలా ప్రణాళికలు రూపొం దించాలని ఆయన సూచించారు.

## సర్ ప్రక్రియలో ఇంటింటికి వెళ్లి ఓటరు వివరాల నమోదు

**-సిమర్ల శ్రీను యాదవ్**
**బిఆర్ఎస్ యువజన నాయకులు**



**దేవరకొండ జూలై 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** చింతపల్లి మండలంలోని తీదేడు గ్రామంలో ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న సర్ కార్యక్రమంలో భాగంగా బూత్ లెవల్ అధికారులతో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల నమోదు కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు సిమర్ల శ్రీను యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు సర్ నమోదు ప్రాముఖ్యతను వివరించి, అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను సకాలంలో నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైనదని, గ్రామ ప్రజలు ఎలాంటి నిర్లక్ష్యం చేయకుండా సర్ ప్రక్రియలో పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకో వాలని కోరారు. ఎన్నికల అధికా రులకు అవసరమైన సహకారం అందించాలని గ్రామస్తులను విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తీదేడు గ్రామ పాలన అధికారి బుషిపాక యాదయ్య, బి.ఎల్.ఓ అంజమ్మ, చింతకుంట్ల రాకేష్ తదితరులున్నారు.

## రైతాంగానికి ప్రత్యామ్నాయం అవసరం నెల్లికంటి సత్యం



**మర్రిగూడ, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఈ సంవత్సరం వర్షాభావం కారణంగా పంటలు తీవ్రంగా నష్టపోతున్న రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “రైతులు వేసిన పంటలు వర్షాలు లేక నష్టపోతున్నాయి. దిగుబడి రాకపోవడంతో రైతు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇలాంటి సమయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల పక్షాన నిలబడాలి” అని అన్నారు. రుణభారం నుండి రైతాంగాన్ని రక్షించాల్సిన అవసరం ఉందని, గతంలో చర్లగూడెం భూములు కోల్పోయిన రైతులకు తక్షణమే నష్టపరిహారం, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలు అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఎరువుల అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రైతు పండించే పంటలకు గిట్టుబాటు ధర కల్పించి దళారి వ్యవస్థను రూపుమాపాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఈదుల భిక్షం రెడ్డి, మండల కార్యదర్శి చెల్లం పాండురంగారావు, ఎర్రకొండ నిరంజన్, ఆకుల రఘుమయ్య, జక్కల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీటిని కాపాడుదాం.. భవిష్యత్తును నిలబెట్టుదాం



**- విద్యార్థులకు మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ పిలుపు**

**ఆమనగల్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షపు నీటిని సంరక్షించి భూగర్భ జలాలను పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమనగల్ మున్సిపల్ చైర్మన్ పత్య నాయక్ అన్నారు. “వర్షపు నీటిని పొదుపు చేద్దాం.. భవిష్యత్తును కాపాడుదాం” కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆమనగల్ మున్సిపాలిటీ పరిధిలోని జడ్పీహెచ్‌ఎస్ గర్ల్స్ హైస్కూల్‌లో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రతి విద్యార్థి రోజువారీ జీవితంలో అవసరమైనంత నీటినే వినియోగించాలని, ఉపయోగించిన తర్వాత నల్లా ట్యాపులను తప్పనిసరిగా బిగించాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, నీటి సంరక్షణలో విద్యార్థులు సమాజానికి మార్గదర్శకులుగా నిలవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఐసీఐసీఐ బ్యాంకు సహకారంతో గతంలో నిర్మించిన భూగర్భ జల సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించి దాని నిర్వహణపై అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి, ఎంఈఓ పాండు, మున్సిపాలిటీ మేనేజర్ ఆంజనేయులు, కౌన్సిలర్ భాగ్యమ్మ రఘు, ఎనముల రమేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు “వన్ మంత్ ఫోర్ విజిట్” కార్యక్రమం నిర్వహణ



**నంద్యాల, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన “వన్ మంత్ -- ఫోర్ విజిట్” కార్యక్రమం భాగంగా వెలుగోడు మండల కేంద్రంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ రాజకుమారి గనియా, జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్‌తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు. అధికారులు ప్రజల ఫిర్యాదులను స్వీకరించి, క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు శాఖకు సంబంధించిన ఫిర్యాదులను చట్టపరంగా అత్యంత ప్రాధాన్యతతో పరిగణించి, నిర్దేశిత గడువులో పరిష్కరిస్తామని తెలిపారు.

## గంజాయి కేసులో నిందితుడికి 5 ఏళ్ల జైలుశిక్ష



**గంగాధర, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా గంగాధర పోలీస్ స్టేషన్‌లో 2022లో నమోదు చేసిన గంజాయి కేసులో నిందితుడికి ఐదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ కరీంనగర్ × అదనపు జిల్లా ఢ సెషన్స్ కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించింది. నిందితుడు వల్లెపు మల్లేశం (20), మెదక్ జిల్లా పటాన్‌చెరు మండలం చిట్కుల్ గ్రామానికి చెందినవాడు. 2022 జూన్ 27న ఘర్షకుర్తి గ్రామ శివారులో 1.260 కిలోల ఎండు గంజాయి విలువ రూ.8,570తో పట్టుబడ్డాడు. అనంతరం చట్టపరమైన ప్రక్రియలతో కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. విచారణ అనంతరం నిందితుడిని దోషిగా నిర్ధారించి శిక్ష విధించారు. ఈ తీర్పుతో 2026లో గంగాధర పోలీస్ స్టేషన్‌కు ఇది 10వ శిక్ష కావడం విశేషం.

## ట్యాలీ ఆధారిత అకౌంటింగ్ నైపుణ్యాలతో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి




**కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శాతవాహన విశ్వవిద్యాలయం వాణిజ్యశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్ యూజింగ్ ట్యాలీ ఈఆర్‌పీ 9 నైపుణ్యాభివృద్ధి కార్యశాల విజయవంతంగా ముగిసింది. ముగింపు కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, ఆధునిక వ్యాపార ఆర్థిక వ్యవస్థలో కంప్యూటరైజ్డ్ అకౌంటింగ్‌కు విశేష ప్రాధాన్యం ఉందని, ట్యాలీ జీఎస్టీ, పేరోల్, ఇన్వెంటరీ వంటి నైపుణ్యాలు విద్యార్థుల్లో ఉపాధి అవకాశాలను పెంచుతాయని పేర్కొన్నారు. కార్యశాల కన్వీనర్ డా. డి. హరికాంత్ మాట్లాడుతూ, కంపెనీ క్రియేషన్, లెడ్జర్ నిర్వహణ, వౌచర్ ఎంట్రీ, జీఎస్టీ అకౌంటింగ్, బ్యాంకింగ్, ఆర్థిక నివేదికలు, డేటా భద్రత వంటి అంశాలపై శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గౌరవ అతిథులుగా పాల్గొన్న ఎన్ఐటీ వరంగల్ సహాయ ఆచార్యుడు డా. బి. రాజ్‌కుమార్, కాకతీయ విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యుడు డా. కె. సాయిశరణ్, సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రమాకాంత్, ఆర్ట్స్ లా కళాశాల ప్రిన్సిపాల్ డా. పద్మావతి విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా 60 మంది విద్యార్థులకు ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కో-కన్వీనర్లు డా. కె. తిరుపతి, డా. బి. నరేష్, డా. బి. పరశురాములు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కార్యాలయంలో కోఆర్డినేటర్ల ముఖ్య సమావేశం



**హుజురాబాద్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో కోఆర్డినేటర్ల ముఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ, ప్రతి బూత్‌లో ఓటర్ల సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ప్రతి ఓటరు ముఖ్యం కాబట్టి బూత్ లెవెల్ ఏజెంట్లతో నిరంతరం సంప్రదింపులు జరపాలని సూచించారు. ఎన్నికల కమిషన్ పొడిగించిన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, క్షేత్రస్థాయిలో సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం, కాంగ్రెస్ పార్టీ ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకున్నందున, నియోజకవర్గ స్థాయిలో ప్రతి కార్యకర్త, బిఎల్ఏ, కోఆర్డినేటర్లు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు, సర్ నియోజకవర్గ కోఆర్డినేటర్ సదయ్య, మండల, పట్టణ అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, కోఆర్డినేటర్లు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

## కమలాపూర్ చేనేత సంఘ కమిటీని సన్మానించిన ప్రణవ్ బాబు



**హుజురాబాద్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కమలాపూర్ మండలంలోని చేనేత సహకార సంఘాల నూతనంగా ఎన్నికైన అధ్యక్షులను హుజురాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బాబు సన్మానించారు. మర్రిపల్లిగూడెం, గోపాలపూర్ చేనేత సంఘాల అధ్యక్షులుగా ఎన్నికైన బైరి జనార్ధన్, పోరండ్ల రమేష్, మామిడాల రమేష్‌లను ప్రణవ్ బాబు మర్యాదపూర్వకంగా కలుసుకుని సన్మానించారు. చేనేత సంఘాలకు, కార్మికులకు ఏ ఆపద వచ్చినా అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తౌటం ఝాన్సీ రాణి రవీందర్, మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొప్ప శివశంకర్, క్యాతం రవీందర్, మెండు రాంబాబు, చేరాల వెంకట్రాజం,
బొల్లం రాజిరెడ్డి, పుల్ల శోభన్ తదితరులు పాల్గొన్నారు

## ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక ప్రోత్సాహం



**పెద్దపల్లి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎల్‌నినో ప్రభావం వల్ల రైతులు నష్టపోకుండా వరి సాగుకు ప్రత్యామ్నాయంగా ఒంటరి మహిళా రైతులకు ఆయిల్ పామ్ సాగుపై ప్రత్యేక ప్రోత్సాహకం అందించనున్నట్లు జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. ఆయిల్ పామ్ సాగు చేపట్టే రైతులకు ఉద్యాన శాఖ ద్వారా నాణ్యమైన మొక్కల సరఫరా, అంతర పంటల సాగు, తోట నిర్వహణ కోసం నాలుగు సంవత్సరాల పాటు ప్రభుత్వం రాయితీలు అందజేస్తోందని ఆయన పేర్కొన్నారు. దీర్ఘకాలికంగా అధిక ఆదాయం పొందే అవకాశాలు ఉన్నాయని వివరించారు. జిల్లాలో పట్టా భూమి కలిగిన ఒంటరి మహిళా రైతులకు ఉద్యాన శాఖ రాయితీలతో పాటు, అదనపు వ్యయాన్ని కలెక్టర్ ఆధీనంలోని నిధుల ద్వారా ప్రత్యేక రాయితీగా అందించనున్నట్లు తెలిపారు. రైతులను ప్రత్యామ్నాయ లాభదాయక పంటల వైపు ప్రోత్సహించడం, ఒంటరి మహిళలను ఆర్థికంగా స్వావలంబన సాధించేలా చేయడం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ స్పష్టం చేశారు. అర్హులైన మహిళా రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం సమీప ఉద్యాన శాఖ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

# ఐసీటీ ఆధారిత బోధనపై అధ్యాపకుల శిక్షణా శిబిరం

**కరీంనగర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (స్వయంప్రతిపత్తి) వాణిజ్యశాఖ ఆధ్వర్యంలో, శాతవాహన విశ్వవిద్యాలయం సహకారంతో ఎన్హాన్సింగ్ టీచింగ్ ఎక్సలెన్స్ త్రూ ఐసీటీ అంశంపై రెండు రోజుల అధ్యాపకుల అభివృద్ధి శిక్షణా శిబిరం శుక్రవారం ప్రారంభమైంది. ప్రారంభోత్సవంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. సతీష్ కుమార్ మాట్లాడుతూ, డిజిటల్ యుగంలో అధ్యాపకులు ఐసీటీ సాధనాలను వినియోగించి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాల్సిన అవసరం ఉందన్నారు. కృత్రిమ మేధ, గూగుల్ టూల్స్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్స్, డిజిటల్ కంటెంట్ రూపకల్పన వంటి సాంకేతికత విద్యార్థుల అభ్యాస సామర్థ్యాన్ని పెంచుతుందని పేర్కొన్నారు. అకాడమిక్ ఎంపవర్‌మెంట్ ప్రోగ్రామ్ కో–ఆర్డినేటర్ డా. ఎన్.వి. శ్రీరంగ



ప్రసాద్ మాట్లాడుతూ, 100 రోజుల అకాడమిక్ ఎంపవర్‌మెంట్ కార్యక్రమం అధ్యాపకుల నైపుణ్యాభివృద్ధికి అరుదైన అవకాశం అని అన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి అధ్యాపకులు ఆధునిక బోధనా పద్ధతులను అవలంబించాలని ఆకాంక్షించారు. వర్క్‌షాప్ డైరెక్టర్ డా. డి. హరికాంత్ మాట్లాడుతూ, రెండు రోజులపాటు ఐసీటీ ఆధారిత బోధన, కృత్రిమ మేధ, ఆన్‌లైన్ మూల్యాంకనం, పరిశోధన సాధనాలు, అకాడమిక్ రచన, ప్లేజరిజం గుర్తింపు, డిజిటల్ కంటెంట్ సృష్టి వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. బి. రజని దేవి, జె. స్వప్న, డా. కె. తిరుపతి, డా. బి. నరేష్, డా. బి. పరశు రాములు సహ–కన్వీనర్లుగా వ్యవహరించారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ శ్రీనివాస్ రెడ్డి, అదనపు కంట్రోలర్ సతీష్ కుమార్, అకాడమిక్ కోఆర్డినేటర్లు మనోజ్ కుమార్, డాక్టర్ సిహెచ్ విద్య, వాణిజ్యశాఖ అధ్యాపకులు మరియు జిల్లాలోని వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల అధ్యాపకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బీఆర్ఎస్ అవినీతి పార్టీలే ప్రవీణ్ రెడ్డి

**జమ్మికుంట, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశం శుక్రవారం సువర్ణ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర యువ మోర్చ ఉపాధ్యక్షులు నరేడ్ల ప్రవీణ్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు సంవత్సరాల పాలనలోనే ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొంటోందని, మహిళలు, రైతులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. బీఆర్ఎస్ అవినీతి పాలనను కాంగ్రెస్ కొనసాగిస్తోందని ఆరోపిస్తూ, ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ జెండా ఎగురుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో శీలం శ్రీనివాస్, జీడి మల్లేష్, కైలాసకోటి గణేష్, రాజేష్ ఠాకూర్, అడువాల కుమార్, నిరుపారాణి, కేస స్వరూప,
బచ్చు శివ, అప్పం మధు, రవి, గంగాభవాని, ఆకుల తిరుపతి, రాకేష్ ఠాకూర్, వొల్లాల సతీష్, కొండ్లె నగేష్, పోచయ్య, తుర్పాటి శంకర్, శ్రీవర్తి ప్రవీణ్, నసీరుద్దీన్, పుల్లూరి ప్రశాంత్,



లోకిని రాజేష్, అప్పాల రవిందర్, కొండపర్తి ప్రవీణ్, ఉడుగుల మహేందర్, యాంసాని సమ్మయ్య, బొనగిరి ప్రణీత్, పనికారి రమేష్, సీనియర్ నాయకులు, బూత్ అధ్యక్షులు పాల్గొన్నారు.

# టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు స్వీకరించిన సలేంద్ర కొమరయ్య

**పెద్దపల్లి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెద్దపల్లి రాజకీయాల్లో బలమైన ముద్ర వేసే దిశగా తెలంగాణ రక్షణ సేన అడుగులు వేస్తోంది. పార్టీ పెద్దపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా సలేంద్ర కొమరయ్య బాధ్యతలు స్వీకరించారు. ప్రెస్ క్లబ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సామాజిక న్యాయమే తన లక్ష్యమని, పార్టీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించడంపై కృతజ్ఞతలు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా అగ్రవర్ణాల నాయకత్వం బీసీలను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకున్నారని, ఇప్పుడు బీసీ వర్గాలకు 50 శాతం రాజకీయ వాటా కల్పిస్తామన్న కవిత హామీ కొత్త ఆశను కల్పించిందని ఆయన పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల కోసం రూపొందించిన పాంచజన్యం పథకాలను ప్రతి గడపకు





తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. కవిత నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసం వ్యక్తం చేసిన సలేంద్ర కొమరయ్య, అన్ని వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ సామాజిక న్యాయాన్ని కార్యరూపంలో చూపిస్తున్నారని అన్నారు. 23 నియోజకవర్గాల్లో 12 స్థానాలకు బీసీ నాయకులను ఇన్‌చార్జ్‌లుగా నియమించడం ఆమె నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ సమావేశంలో బొంగోని శంకరయ్య గౌడ్, ఉస్తాం శ్రీనివాస్ ముదిరాజ్, బొంకూరి సుభాష్, కల్వల తిరుపతి, చిట్టుమల్ల హనుమాండ్లు, చిలుక ఆనంద్, గడ్డం వెంకటేష్, ఎంచెర్ల స్వామి, పిల్లి శివ, పల్లె శ్రీనివాస్, మేకల శ్రీనివాస్, రాజ్‌కుమార్ యాదవ్,
విశ్వతేజు, కల్వల రవీందర్,
రాజేందర్ తదితరులు
పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియలో జరిగిన సాంకేతిక సమస్యలను పరిష్కరించాలి

**– పంబాల పర్వతాలు**

**దేవరకొండ జూలై 17. (నీలగిరి ఎక్స్ ప్రెస్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ –2026 కార్యక్రమంలో భాగంగా, దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ సూచనల మేరకు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వాంకునావత్ బిక్కు నాయక్ మరియు నేరేడు గొమ్ము క్లస్టర్ కోఆర్డినేటర్ గిరి యాదయ్య పర్యవేక్షణలో నేరేడుగొమ్ము మండలంతిమ్మాపురం గ్రామం (పోలింగ్ కేంద్రం నెం. 202)లో ఎన్యూమరేషన్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన అనంతరం, నేడు మండల తహసీల్దార్ శ్రీమతి ఉమాదేవి తో కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఎ పంబాల పర్వతాలు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.



ఈ సందర్భంగా ఎన్యూమరేషన్ ఫారాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియలో ఎదురైన సాంకేతిక సమస్యలు, కొన్ని చోట్ల నమోదైన వివరాల్లో జరిగిన పొరపాట్లు, ఓటర్ల వివరాల్లో తలెత్తిన వ్యత్యాసాలను ఎమ్మార్వో దృష్టికి తీసుకువెళ్లారు.
ఈ సమస్యల కారణంగా అర్హులైన ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా, నమోదైన తప్పులను వెంటనే సరిదిద్దాలని, ప్రతి ఓటరి ఓటు హక్కు పరిరక్షించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పంబాల పర్వతాలు కోరారు.
దీనిపై స్పందించిన ఎమ్మార్వో ఉమాదేవి , ఓటర్ల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి, సాంకేతిక లోపాలు మరియు నమోదులో జరిగిన పొరపాట్లను నిబంధనల ప్రకారం సవరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన ఓటరు పేరు సరైన వివరాలతో ఓటరు జాబితాలో ఉండేలా అందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని ఈ సందర్భంగా పంబాల పర్వతాలు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# నల్గొండ మహాసభలతో రైతాంగ ఉద్యమానికి కొత్త దిశ





**నల్గొండ, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేశవ్యాప్తంగా రైతాంగ ఉద్యమాలకు కొత్త దిశానిర్దేశం చేయాలన్న లక్ష్యంతో అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను నవంబర్ 18 నుంచి 21 వరకు నల్గొండలో నిర్వహించనున్నట్లు జాతీయ ప్రధాన కార్యదర్శి విజ్జు కృష్ణన్ ప్రకటించారు. ఏచూరి గార్డెన్స్‌లో జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట స్ఫూర్తిని దేశవ్యాప్తంగా రైతు నాయకులకు పరిచయం చేయడమే ఈ మహాసభల ప్రధాన ఉద్దేశ్యం” అని తెలిపారు. 1936లో లక్నోలో స్థాపించబడిన ఏఐకేఎస్ ఇప్పటివరకు పలాసా, విజయవాడ, ఖమ్మం, గుంటూరు వంటి కేంద్రాల్లో మహాసభలు నిర్వహించి రైతాంగ ఉద్యమ చరిత్రలో కీలక మలుపులు తీసుకువచ్చిందని గుర్తుచేశారు. ఈసారి తెలంగాణ రైతాంగ పోరాటానికి 80 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంలో నల్గొండలో మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా అమలు చేస్తున్న విధానాల వల్ల రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని విజ్జు కృష్ణన్ ఆరోపించారు. అమెరికా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలతో కుదుర్చుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు భారత రైతులకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తాయని హెచ్చరించారు. 2020లో రైతు ఉద్యమం ద్వారా వెనక్కి తీసుకున్న మూడు వ్యవసాయ చట్టాలను ఇప్పుడు పరోక్షంగా అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా నిల్వ సౌకర్యాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడం ద్వారా వ్యవసాయ రంగంలో గుత్తాధిపత్యానికి అవకాశం కల్పిస్తున్నారని అన్నారు. జూలై 22న గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు, ఆగస్టు 10న దేశవ్యాప్తంగా “జైల్ భరో” ఉద్యమం నిర్వహించనున్నట్లు తెలిపారు. దాదాపు 10 లక్షల మంది రైతులు, కార్మికులు ఈ పోరాటంలో పాల్గొంటారని విజ్జు కృష్ణన్ ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, జిల్లా అధ్యక్ష కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, మల్లు లక్ష్మి, నన్నూ నాగేశ్వరరావు, బొంతల చంద్రారెడ్డి, సయ్యద్ హాషం తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

**– మాజీ కౌన్సిలర్ చెన్నకేశవులు పిలుపు**



**ఆమనగల్లు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ 14వ వార్డులో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ శుక్రవారం మాజీ కౌన్సిలర్ శెట్టిమల్ల చెన్నకేశవులు ఆధ్వర్యంలో కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను ప్రతి అర్హుడైన ఓటరు సద్వినియోగం చేసుకుని తమ వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. కొత్త ఓటర్ల నమోదు, చిరునామా మార్పు, పేర్ల సవరణ, తొలగింపులు వంటి అంశాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ఒక్క ఓటు కూడా వృథా కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతతో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకుని భవిష్యత్ ఎన్నికల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఓటరు వివరాలను సరిచేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, బీఎల్ఓ స్వరూప, నాయకులు షార్ఫోద్దిన్, గౌస్, వీరయ్య, చంద్రయ్య, రాములు, విష్ణు, ఫిరోజ్, ఎకుల శ్రీను, శెట్టిమల్ల రామలీల, చెన్నమ్మ, మాధవి, ఇస్తారమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత విద్యకు అండగా పాపిశెట్టి రాము



**ఆమనగల్లు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధికి చెందిన నాగోజు శివాని, సురేందర్ చారి దంపతుల కుమార్తె హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో మాస్టర్ ఇన్ పబ్లిక్ హెల్త్ కోర్సులో సీటు సాధించిన సందర్భంగా శుక్రవారం ప్రముఖ సంఘసేవకులు, కౌన్సిలర్ పాపిశెట్టి రాము విద్యార్థినికి ఆర్థిక చేయూత అందించారు. కార్పెంటర్‌గా జీవనం సాగిస్తున్న సురేందర్ చారి కుటుంబానికి అండగా నిలుస్తూ ఉన్నత విద్యాభ్యాసానికి అవసరమైన ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పాపిశెట్టి రాము మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులు ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదని, విద్యార్థులకు చేయూత అందించడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. విద్యార్థిని శివాని ఉన్నత విద్యలో రాణించి కుటుంబానికి, ఆమనగల్లుకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాము మిత్రమండలి సభ్యులు శ్రీను నాయక్, శిరమోని రమేష్ యాదవ్ తదితరులు పాల్గొని విద్యార్థినికి శుభాకాంక్షలు తెలిపారు.

# న్యాయ పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

**– జడ్జి నారం అరుణ్ కుమార్**



**ఆమనగల్లు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆమనగల్ జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి పౌరుడు చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని సూచించారు. న్యాయం, సమానత్వం, రాజ్యాంగ విలువల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి నారం అరుణ్ కుమార్, కోర్టు సూపరింటెండెంట్ మురళీధర్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్తీక్‌లను ఆమనగల్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు శేఖర్, సంయుక్త కార్యదర్శి మధు గౌడ్, కోశాధికారి మల్లేష్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు దేవేందర్ గౌడ్, సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ శర్మ, మల్లేష్ గౌడ్, దుడ్డు ఆంజనేయులు, రామకృష్ణ, జగన్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, శ్రీనివాస్, మహేశ్వర్, శ్రీశైలం, శివశంకర్, శిరీష, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బిజీ షెడ్యూల్

- ఆమనగల్‌లో విద్యార్థినులకు యూనిఫాంల పంపిణీ
- చౌదర్‌పల్లిలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశం
- చలంపల్లిలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన



**ఆమనగల్లు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శనివారం (జూలై 18) నియోజకవర్గంలో వరుస అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. ఉదయం 10 గంటలకు ఆమనగల్ పట్టణంలోని కేజీబీవీ ప్రభుత్వ పాఠశాలలో 350 మంది విద్యార్థినులకు స్కూల్ డ్రెస్సుల పంపిణీ చేయనున్నారు. అనంతరం ఉదయం 11:30 గంటలకు తలకొండపల్లి మండలం చౌదర్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 2:30 గంటలకు కడ్తాల్ మండలం చలంపల్లి గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, మండల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అలాగే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు.

# ఆమనగల్‌కు బీఎస్ఎన్ఎల్ 5జీ.. మల్లేపల్లికి సెల్ టవర్ కోరిన నేతలు



**ఆమనగల్లు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ పట్టణంలో బీఎస్ఎన్ఎల్ 5జీ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మండలంలోని మల్లేపల్లి గ్రామానికి సెల్ టవర్ మంజూరు చేయాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవిని కాంగ్రెస్ నాయకులు కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, డీసీసీ కార్యదర్శి వెంకటరమణారెడ్డి, కాంగ్రెస్ నాయకులు శెట్టిపల్లి సత్యం, రవికుమార్, ఖాదర్ ఖాద్రి తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమనగల్ పట్టణం, మండలంలోని గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ మొబైల్ సేవలను విస్తరించాలని, ముఖ్యంగా ఆమనగల్‌కు 5జీ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మల్లేపల్లి గ్రామంలో సెల్ టవర్ ఏర్పాటు చేసి నెట్‌వర్క్ సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని ఎంపీకి విజ్ఞప్తి చేశారు. అలాగే మల్లేపల్లి గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎంపీ డాక్టర్ మల్లు రవి హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# నల్గొండలో రాత్రి గస్తీ నిఘా పటిష్టం




**నల్గొండ, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జిల్లా పోలీసు శాఖ రాత్రి నిఘా వ్యవస్థను మరింత బలోపేతం చేసింది. నైట్ బీట్ సిబ్బందికి రిఫ్లెక్టివ్ జాకెట్లు, ఎల్ఈడీ లాఠీలు, ఫైబర్ లాఠీలు అందజేసి, రాత్రి గస్తీని సమర్థవంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, ఐపీఎస్ ఈ భద్రతా పరికరాలను పంపిణీ చేస్తూ, "దొంగతనాలు, గొలుసు దొంగతనాలు, వాహనాల దొంగతనాలు, ఇతర నేరాలను నివారించడానికి రాత్రి గస్తీని ముమ్మరం చేయాలి. ప్రమాదకర ప్రాంతాలు, నివాస కాలనీలు, హైవేలు, ఏటీఎంలు, బ్యాంకులు, నగల దుకాణాలు వంటి సున్నితమైన ప్రదేశాల్లో పహారా ఉండాలి" అని అధికారులను ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలను వెంటనే తనిఖీ చేయాలని, మహిళలు, వృద్ధులు, ఆపదలో ఉన్నవారికి తక్షణ సహాయం అందించాలని ఆయన సూచించారు. ప్రజలకు అనుకూలమైన పోలీసింగ్ ద్వారా భద్రతను మెరుగుపరచడం, పోలీసింగ్‌ను ఆధునికీకరించడం, ప్రజల విశ్వాసాన్ని బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని ఎస్పీ పేర్కొన్నారు.

# ర్యాకల్దేవుపల్లిలో ఉచిత హెల్త్ క్యాంపు



**ఎలిగేడు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ర్యాకల్దేవుపల్లిలో గ్రోమోర్ సెంటర్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకుని, ఉచితంగా మందులు పొందారు. వైద్యుల సలహాలు, సూచనలు తీసుకున్నారు. గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు నాణ్యమైన ఉచిత ఆరోగ్య సేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో గ్రోమోర్ సెంటర్ చేపట్టిన ఈ కార్యక్రమాన్ని గ్రామస్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్, గ్రోమోర్ సెంటర్ మేనేజర్ కల్వల జీవన్ రెడ్డి, ఫీల్డ్ ఆఫీసర్ మడ్లపల్లి లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలి



**ఎలిగేడు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రస్తుత వానాకాల వాతావరణ పరిస్థితులు, ఎల్నినో ప్రభావం కారణంగా వరి పంటకు బదులుగా రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని మండల ఏఈఓ సురేష్ సూచించారు. నారాయణపల్లిలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ, ఎల్నినో ప్రభావం వల్ల వర్షపాతం తగ్గే అవకాశం ఉందని, భూగర్భ జలాలు గణనీయంగా పడిపోవచ్చని హెచ్చరించారు. నీటి లభ్యతను బట్టి పంట మార్పిడి విధానాన్ని అనుసరించడం రైతులకు మేలు చేస్తుందని వివరించారు. జూలై 30లోపు వర్షాలు కురిస్తే పత్తి, కంది, మొక్కజొన్న, జొన్నలు, వేరుశనగ వంటి పంటలను సాగు చేయవచ్చని, ఆగస్టు 1 నుంచి 15 మధ్య వర్షాలు వస్తే తక్కువ నీటితో పండే చిరుధాన్యాలు, కంది, కూరగాయల సాగు అనుకూలమని సూచించారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలని, డ్రిప్ పరికరాలను ప్రభుత్వం భారీ సబ్సిడీపై అందిస్తోందని తెలిపారు. ఈ పంట నాలుగు సంవత్సరాల నుండి స్థిరమైన దిగుబడి ఇస్తుందని, అంతరపంటలతో రైతులు ఆర్థికంగా బలోపేతం కావచ్చని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొత్తి రెడ్డి బాపురెడ్డి, రైతులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతతోనే సంపూర్ణ ఆరోగ్యం



**ఎలిగేడు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వచ్ఛత పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని గ్రామ సర్పంచ్ మద్దెల రమాదేవి--సంపత్ అన్నారు. ఎలిగేడు మండలంలోని ర్యాకల్దేవుపల్లిలో శుక్రవారం స్వచ్ఛశుక్రవారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇంటింటా తిరుగుతూ ప్రజలకు నాలుగు రకాల చెత్తను వేరు చేయడం, నీటి నిల్వలు లేకుండా చూసుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అవగాహన కల్పించారు. పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించవచ్చని, ఆరోగ్యవంతమైన గ్రామం నిర్మాణం సాధ్యమవుతుందని ఆమె వివరించారు. తరువాత గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల విద్యాప్రగతిని అడిగి తెలుసుకున్నారు. మండలంలోని ఇతర గ్రామాల్లో కూడా స్వచ్ఛశుక్రవారం కార్యక్రమాలు నిర్వహించారని అధికారులు తెలిపారు.

# అమరుల యాదిలో గీతన్నల చైతన్య యాత్రను జయప్రదం చేయండి: తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం



**నల్లగొండ ,జులై 17 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కల్లు గీత వృత్తిలో ప్రమాదాల నివారణ వన రక్షణ, ఉపాధి, సంక్షేమం, ఆధునీకరణకు ప్రభుత్వం తీసుకోవలసిన చర్యల గురించి 2026 ఆగస్టు రెండు నుండి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్ర నిర్వహిస్తున్నామని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండ వెంకన్న, చౌగాని సీతారాములు అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని వృత్తిదారుల కార్యాలయంలో గీతన్నల చైతన్య యాత్ర పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆగస్టు రెండు నుండి బయలుదేరిన బస్సు యాత్ర ఆరవ తారీఖున నల్లగొండ జిల్లా కేంద్రానికి చేరుకుంటుందని ఆయన తెలిపారు. ఈ జిల్లాలో కార్మికులు దాదాపు 20,25 వేల కల్లుగీత కార్మికులు కల్లు గీతా వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో మార్పులు తీసుకవచ్చి మాదాలను నివారించాలని వృత్తిలో జరుగుతున్న ప్రమాదాలను నివారించాలని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలు మనకు ఇచ్చిన హామీలు పెన్షన్ 4000 రూపాయలు, ఎక్ష్రేషియా 10 లక్షలు చెట్ల పెంపకానికి భూమి తదితర డిమాండ్లను పరిష్కారం చేయుటకై ప్రభుత్వాన్ని నిలదీస్తామని ఆయన అన్నారు. మనకోసం పోరాడి అమరులైన కామ్రేడ్ ధర్మ బిక్షం, తోట్ల మల్సూరు, బైరు మల్లయ్య, వర్ధల్లి బుచ్చి రాములు, వేముల నాగయ్య, బాధిని చెన్నయ్య,జినుకుంట్ల లింగయ్య, బొమ్మగాని జానయ్య, కొండ నాగులు, కొండ రాములమ్ లాంటి ఎందరో త్యాగమూర్తులను యాది చేసుకుంటూ ఈ యాత్ర కొనసాగుతుందని వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు పామన గుండ్ల అచ్చాలు, జిల్లా సహాయ కార్యదర్శులు రాచకొండ వెంకట్ గౌడ్, ఉప్పల గోపాల్, జెర్రిపోతుల ధనంజయ, గంజి మురళీధర్, కంఠ మహేశ్వర్, సూరి గల యాదయ్య,బూరుగు కృష్ణవేణి, చాపల మారయ్య, మల్ల మహేష్, రామకృష్ణ, ఈరటి వెంకన్న, యాదగిరి, బల్లెం స్వామి, నరసింహ, భూపాల్, లక్ష్మయ్య, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం




**రంగారెడ్డి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శివరాంపల్లి కాన్ఫరెన్స్ హాల్‌లో అవగాహన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి హాజరై, జనాభా మార్పులు, కుటుంబ సంక్షేమం, మహిళల ఆరోగ్యం, తల్లి-శిశు సంరక్షణ వంటి అంశాలపై ప్రతి కుటుంబానికి అవగాహన కల్పించడం అత్యంత అవసరమని సూచించారు. "అనవసర గర్భధారణలను నివారించడం, ప్రసవాల మధ్య తగిన విరామం పాటించడం ద్వారా తల్లి-శిశువు ఆరోగ్యం మెరుగుపడుతుంది. ఆరోగ్యవంతమైన కుటుంబమే సమాజ అభివృద్ధికి పునాది" అని ఆమె పేర్కొన్నారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ స్వర్ణ కుమారి మాట్లాడుతూ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల విజయవంతమైన అమలులో వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తల పాత్ర కీలకమని అన్నారు. "ప్రతి గర్భిణిని నమోదు చేసి, తల్లి-శిశు ఆరోగ్య సేవలు అందించడం, కుటుంబ నియంత్రణపై నిరంతర అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది" అని వివరించారు. కార్యక్రమం ముగింపులో విశిష్ట సేవలందించిన వైద్యాధికారులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్ మయి ప్రశంసా పత్రాలు, అవార్డులు ప్రదానం చేశారు. ఈ గుర్తింపు తమలో మరింత బాధ్యత, ఉత్సాహాన్ని నింపిందని అవార్డు గ్రహీతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. షీబా హయాత్, డా. రాధిక, డా. పాపారావు, డా. రాకేష్, డా. జ్యోతిబాయి, డెమో మంజుల ,మాస్ మీడియా అధికారి కె. శ్రీనివాసులు తో పాటు వైద్యాధికారులు, సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# దేవరకొండలో అంతర్రాష్ట్ర దొంగల ముఠా గుట్టురట్టు

**-కేసు వివరాలు వెల్లడిస్తున్న డి.ఎస్. పి. శ్రీనివాస్ రావు.**




**దేవరకొండ జూలై 17.(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** దేవరకొండలో సంచలనం సృష్టించిన బస్టాండ్ దొంగతనం కేసును పోలీసులు ఛేదించారు. ప్రయాణికుల రద్దీని ఆసరాగా చేసుకుని బ్లేడ్లతో బ్యాగులు, కవర్లు కోసి నగదు దోచుకునే అంతర్రాష్ట్ర దొంగల ముఠాను దేవరకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకోగా, మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ నెల ఒకటో తేదీన దేవరకొండ కొత్త బస్టాండ్‌లో మండల లక్ష్మమ్మ అనే మహిళ చేతిలో ఉన్న కవర్‌ను బ్లేడుతో కట్ చేసి రూ.2 లక్షల నగదును దుండగులు అపహరించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో కొత్త బస్టాండ్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఏపీ రాష్ట్రంలోని బాపట్ల జిల్లా చీరాల ప్రాంతానికి చెందిన అన్నారెడ్డి ఈశ్వరి, కావడి అంజమ్మ, ఆటో డ్రైవర్ కటారి రవిచందర్‌లుగా గుర్తించారు. మరో నిందితుడు అన్నారెడ్డి మధు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, ప్రధాన నిందితురాలు ఏ1 అన్నారెడ్డి ఈశ్వరి (భర్త: మధు)పై ఇప్పటికే 10 కేసులు, ఏ2 కావడి అంజమ్మ (భర్త: ప్రసాద్)పై 40 కేసులు నమోదై ఉన్నట్లు గుర్తించారు. వీరంతా 2015 నుంచి తెలుగు రాష్ట్రాల్లోని పలు బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీని లక్ష్యంగా చేసుకుని బ్లేడ్లతో బ్యాగులు కట్ చేసి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు దర్యాప్తులో తేలింది..నిందితుల నుంచి దొంగతనాలకు ఉపయోగించిన ఏపి39-యూవి-6724 నంబర్ గల పసుపు రంగు ఆటో, మూడు స్మార్ట్‌ఫోన్లు, రూ.12 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును వేగంగా ఛేదించిన ఇన్‌స్పెక్టర్ వెంకట్ రెడ్డి, ఎస్ఐలు రాజ్ నారాయణ రెడ్డి, ప్రకాష్ రెడ్డి మరియు పోలీసు సిబ్బందిని డీఎస్పీ శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

# ఏకలవ్య గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



**వెల్దండ, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండలంలోని గుండాల గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ ఏకలవ్య ఆదర్శ గురుకుల పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులను ఆయన సమగ్రంగా పరిశీలించారు. మొదట భోజనశాలను సందర్శించిన కలెక్టర్, విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం నాణ్యత, మెనూ అమలు, పరిశుభ్రత ప్రమాణాలను పరిశీలించారు. వంటశాలలో ఆహార పదార్థాల నిల్వ, తాగునీటి వినియోగం, వంట ప్రక్రియలను తనిఖీ చేసి నాణ్యమైన ఆహారం అందేలా నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సిబ్బందికి సూచించారు. తరువాత విద్యార్థుల డార్మిటరీలను పరిశీలించి పడకల ఏర్పాటు, గదుల పరిశుభ్రత, విద్యుత్ సౌకర్యాలు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, తాగునీటి వసతి వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి బోధన తీరును పరిశీలించిన కలెక్టర్, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, డిజిటల్ లెర్నింగ్ వినియోగం, విద్యార్థుల హాజరు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి అభ్యాస స్థాయిని అంచనా వేసి, సీబీఎస్ఈ సిలబస్‌కు అనుగుణంగా బోధన కొనసాగించాలని సూచించారు. భావనాత్మక అవగాహన, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, పోటీ పరీక్షలకు అవసరమైన సామర్థ్యాల పెంపుపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, సిబ్బంది తాగునీటి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే స్పందించిన ఆయన పాఠశాల ప్రాంగణంలోనే బోరు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, క్రీడా సామగ్రి, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్ వినియోగం వంటి అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, "గిరిజన విద్యార్థులకు అత్యున్నత స్థాయి విద్యను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఏకలవ్య గురుకుల పాఠశాలలను నిర్వహిస్తోంది. నాణ్యమైన విద్యతో పాటు ఉత్తమ వసతి, పౌష్టికాహారం, పరిశుభ్రమైన వాతావరణం, ఆధునిక మౌలిక సదుపాయాలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం" అని స్పష్టం చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించడం ప్రతి అధికారి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీఓ జనార్దన్ రెడ్డి, వెల్దండ తహశీల్దార్ కార్తిక్ కుమార్, యంఈఓ చంద్రుడు నాయక్, పాఠశాల ప్రిన్సిపల్ సుమన్ కుమార్, వైస్ ప్రిన్సిపల్ భాస్కర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**కల్వకుర్తి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, గర్భిణీలకు అందిస్తున్న ఆరోగ్య సదుపాయాలను ఆయన సమగ్రంగా పరిశీలించారు. ఆసుపత్రిలోని విభాగాలను సందర్శించిన కలెక్టర్, వైద్యులు మరియు సిబ్బందితో మాట్లాడి చికిత్స, పరీక్షలు, మందుల లభ్యత, మౌలిక సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య సేవలు అందేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఏఎన్‌సీ పరీక్షల కోసం వచ్చిన గర్భిణీలను కలెక్టర్ పలకరించి, వారు ఆసుపత్రికి ఎలా వచ్చారో తెలుసుకున్నారు. బస్సులో ప్రయాణించి వచ్చామని గర్భిణీలు చెప్పడంతో, కలెక్టర్ ఆశా కార్యకర్తలను ప్రశ్నించారు. ప్రభుత్వం అందిస్తున్న 102 అంబులెన్స్ సేవలు వినియోగించకపోవడం ఎందుకని ఆరా తీశారు. గర్భిణీల రవాణా కోసం తప్పనిసరిగా 102 సేవలను వినియోగించాలని ఆయన స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గర్భిణీల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ, హైరిస్క్ గర్భిణీలను ప్రత్యేకంగా గుర్తించి అవసరమైన వైద్య సేవలు అందించాలని వైద్య అధికారులకు సూచించారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో నేరుగా మాట్లాడి, వారికి అందుతున్న వైద్య సేవలు, మందుల లభ్యత, వైద్యుల అందుబాటు, పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. "ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో విశ్వాసం పెరిగేలా సేవలు అందించాలి. రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలి" అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల, ఆర్డీవో జనార్దన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మహమ్మద్, తహసీల్దార్ ఇబ్రహీం, డాక్టర్ శివరాం, డిప్యూటీ డీఎంహెచ్ఓతో పాటు వైద్యాధికారులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్



**కల్వకుర్తి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో నిర్వహించిన ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భృంగి రత్నమాలతో కలిసి పాల్గొన్నారు. సావిత్రిబాయి పూలే ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రాంగణంలో విద్యార్థులు చేపట్టిన కార్యక్రమాన్ని పరిశీలించి, వారితో వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాటాడుతూ, వర్షాకాలంలో డెంగ్యూ, చికున్‌గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉందని, వాటిని నివారించేందుకు ప్రతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని ప్రజలందరూ బాధ్యతగా నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ప్రజల్లో అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఇళ్లలో, విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, వ్యాపార సంస్థల పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కూలర్లు, నీటి ట్యాంకులు, డ్రమ్‌లు, బకెట్లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, పాత టైర్లు, ఉపయోగం లేని పాత్రలు వంటి వాటిని వారానికి కనీసం ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు. "దోమలు నిల్వ నీటిలోనే ఎక్కువగా వృద్ధి చెందుతాయి. అందువల్ల ప్రతి కుటుంబం 'ప్రతి శుక్రవారం డ్రై డే' అనే భావనను అలవాటు చేసుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు. తరువాత కలెక్టర్, మున్సిపల్ చైర్‌పర్సన్‌తో కలిసి కాలనీలోని పలువురి ఇండ్లను సందర్శించి నిల్వ నీటి ప్రాంతాలను పరిశీలించారు. ఇంటి యజమానులకు దోమల నివారణ చర్యలపై అవగాహన కల్పిస్తూ పరిశుభ్రత పాటించాలని సూచించారు. అధికారులు కూడా ప్రజలకు డ్రై డే నిర్వహణ ప్రాముఖ్యతను వివరించి, ప్రతి వారం తప్పనిసరిగా అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అహ్మద్, తహసీల్దార్ ఇబ్రహీం, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరం

**- జూలూరి రమేష్ బాబు**



**కల్వకుర్తి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి నియోజకవర్గ కేంద్రంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో ఆర్యవైశ్య కుటుంబ సభ్యుల సమావేశం ఘనంగా జరిగింది. ఆలయ ట్రస్టు చైర్మన్, వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ సెక్రటరీ సర్వీసెస్ జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆలయ అభివృద్ధి అంశాలు చర్చకు వచ్చాయి. దాదాపు 38 సంవత్సరాల క్రితం నిర్మించబడిన ఈ ఆలయాన్ని మరింత అంగరంగ వైభవంగా తీర్చిదిద్దేందుకు, ఆలయం ఆవరణలోని ఫంక్షన్ హాల్ మరమ్మత్తులు చేపట్టాలని రమేష్ బాబు పిలుపునిచ్చారు. సుమారు 80 లక్షల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన తెలిపారు. 2026--27 దసరా నవరాత్రి ఉత్సవ కమిటీ అధ్యక్షునిగా కల్మచర్ల గోపాల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ మాట్లాడుతూ, "వైశ్యులంతా ఐక్యమత్యంతో మెలిగి ఆలయాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్దుదాం" అని అన్నారు. అనంతరం జూలూరు రమేష్ బాబు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర రాజకీయ కమిటీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కొండూరు గోవర్ధన్, తెలంగాణ మజ్దూర్ యూనియన్ కల్వకుర్తి డిపో అధ్యక్షుడిగా ఎన్నికైన శివ జగదీశ్వర్, ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా ఎన్నికైన కల్మచర్ల గోపాల్లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కల్మచర్ల రమేష్, మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గంధం ప్రసాద్, పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వాస శేఖర్, కల్వ మనోహర్, శివాలయం శ్రీనివాస్, గంప శ్రీనివాస్, బచ్చు ఎల్లయ్య, శ్రీధర్, ముత్యాలుతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్యవైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు.

# ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేయాలని సిపిఐ డిమాండ్




**నందికొట్కూరు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిడుతూరు మండల ఎత్తిపోతల పథకానికి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి నిధులు విడుదల చేయాలని సి.పి.ఐ.(ఎం.ఎల్.) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం నందికొట్కూరులో పార్టీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు మిడుతూరు మండలానికి ఎత్తిపోతల పథకాన్ని మంజూరు చేస్తామని, 2025లో జలహారతి కార్యక్రమంలో రూ.60 కోట్లతో పథకాన్ని చేపడతామని ముఖ్యమంత్రి ప్రకటించినా, ఏడాది గడిచినా ఎలాంటి పురోగతి కనిపించలేదని విమర్శించారు. మల్యాల హంద్రీనీవా కాలువ నుంచి బ్రాహ్మణకొట్టుకూరు వరకు 19 కిలోమీటర్ల మేర ఎత్తిపోతల పథకం నిర్మించి మిడుతూరు రైతులకు సాగునీరు అందిస్తామని హామీ ఇచ్చినా, కరవు పరిస్థితుల్లో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని కోరారు. ప్రజాప్రతినిధులు పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకపోయిందని ఆరోపిస్తూ, ఇప్పటికైనా ఒత్తిడి తీసుకువచ్చి పథకాన్ని అమలు చేయాలని కోరారు. లేదంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలను చైతన్యపరిచి, లిఫ్ట్ ఇరిగేషన్ సాధన కమిటీ ఏర్పాటు చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు, మహిళా సంఘం ప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ఐటీ, బ్యాంకింగ్ జోష్.. భారీ లాభాలతో ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు!



గ్లోబల్ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు ఎదురైనప్పటికీ, దేశీయ ఐటీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఆటో రంగాల షేర్లలో వచ్చిన భారీ కొనుగోళ్ల మద్దతుతో ఇవాళ (శుక్రవారం) ఫ్లాట్ ట్రెండ్‌ను పక్కనబెట్టి దలాల్ స్ట్రీట్ అద్భుతమైన ర్యాలీని సాధించింది. సెన్సెక్స్ ఏకంగా 960 పాయింట్లకు పైగా లాభపడగా, నిఫ్టీ కీలకమైన 24,300 మార్కును దాటి ముగిసింది.

ఉదయం 77,370.77 వద్ద ప్రారంభమైన సెన్సెక్స్, రోజంతా కొనుగోళ్ల జోరుతో గరిష్ఠంగా 78,282.55 పాయింట్ల స్థాయిని తాకింది. చివరికి.. క్రితం ముగింపు 77,186.87తో పోలిస్తే 964.59 పాయింట్లు (1.25శాతం) లాభపడి 78,151.45 వద్ద స్థిరపడింది. నిఫ్టీ కూడా 24,127.60 వద్ద గ్రీన్ మార్క్‌తో ట్రేడింగ్‌ను ఆరంభించి, ఇంట్రాడేలో 24,367.30 గరిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతిమంగా 261.55 పాయింట్లు (1.09శాతం) ఎగబాకి 24,334.30 వద్ద క్లోజ్ అయింది.

ఐటీ, బ్యాంకింగ్ షేర్ల అండజూన్ త్రైమాసిక ఫలితాల సీజన్ ప్రారంభం కావడం మార్కెట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఐటీ దిగ్గజం టెక్ మహీంద్రా అంచనాలకు మించి లాభాలను ప్రకటించడంతో ఐటీ రంగం పరుగులు పెట్టింది. దీనికి తోడు హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి లార్జ్ క్యాప్ ఐటీ షేర్లు నిఫ్టీ ర్యాలీని ముందుండి నడిపించాయి. ప్రైవేట్ బ్యాంకింగ్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ వంటి హెవీవెయిట్ స్టాక్స్ కూడా మార్కెట్ బుల్లిష్ ట్రెండ్‌కు బలమైన మద్దతు నిచ్చాయి. గ్లోబల్ ఒత్తిడిని అధిగమించిన వైనంఆసియా మార్కెట్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నప్పటికీ మన మార్కెట్లు సొంత బలంతో రాణించాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వ్యాఖ్యల నేపథ్యంలో అంతర్జాతీయంగా సెంటిమెంట్ కాస్త బలహీనంగా ఉన్నప్పటికీ, దేశీయంగా ఇన్వెస్టర్లు కొనుగోళ్లకే మొగ్గు చూపారు.

వెనుకబడిన బ్రాడర్ మార్కెట్స్‌ప్రధాన సూచీలు దాదాపు ఒక శాతానికి పైగా లాభాల్లో దూసుకుపోయినప్పటికీ.. మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్స్ మాత్రం ఇవాళ నిరాశపరిచాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100, స్మాల్ క్యాప్ 100 సూచీలు వరుసగా 0.41శాతం, 0.21శాతం చొప్పున నష్టాల్లో ముగిశాయి. మార్కెట్ కొనుగోళ్లు కేవలం లార్జ్ క్యాప్ హెవీవెయిట్స్ కే పరిమితం కావడమే ఇందుకు కారణం. ఈ వారాంతపు ట్రేడింగ్ సెషన్ క్లోజింగ్ మార్కెట్ బలాన్ని స్పష్టం చేస్తోంది. ముఖ్యంగా నిఫ్టీ 24,100 దిగువన బలమైన సపోర్ట్ తీసుకుని సరికొత్త రికార్డుల దిశగా పుంజుకోవడం ఇన్వెస్టర్లకు సానుకూల అంశం. వచ్చే వారం వెలువడనున్న ప్రధాన కార్పొరేట్ కంపెనీల ఫలితాలు, బడ్జెట్ అంచనాలు మార్కెట్ తదుపరి దిశను నిర్దేశించనున్నాయని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

# షేర్లు కొనడానికి 30 సెకన్లు చాలు.. కానీ ఎప్పుడు అమ్మాలో తెలవడమే అసలు నైపుణ్యం.. ఎవరూ చెప్పని టిప్స్ మీకోసం..!





స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. చాలా సులభంగా మొబైల్ ఫోన్ ద్వారానే క్షణాల్లో షేర్లు కొనుగోలు, విక్రయాలు చేసేస్తున్నారు. ఒక స్టాక్ కొనేందుకు 30 సెకన్లు సరిపోతుంది కానీ దానిని ఎప్పుడు అమ్మాలో తెలియక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. కొనుగోలు చేయడం సులభమైనా దానిని ఎప్పుడు అమ్మాలో తెలియడంలోనే అసలు నైపుణ్యం దాగి ఉంటుంది. స్టాక్ విక్రయంపై ఎవరూ చెప్పని కొన్ని విషయాలను ఇప్పుడు మనం తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.

స్టాక్ మార్కెట్లో పెట్టుబడి పెడుతున్న వారు అందరూ ఏ షేరు కొనాలి, ఏ మల్టీబ్యాగర్ స్టాక్ ఎంచుకోవాలి అనే విషయంపైనే ఎక్కువగా రీసెర్చ్ చేస్తారు. కానీ, కొన్ని షేరును ఎప్పుడు అమ్మాలో చాలా మందికి తెలియదు. నిజానికి స్టాక్ మార్కెట్లో షేర్లు కొనడానికి కేవలం 30 సెకన్లు సరిపోతుంది. కానీ, కొన్న స్టాక్‌ను సరైన సమయానికి అమ్మేయడమే అసలైన కళ అని మార్కెట్ నిపుణులు చెబుతుంటారు. చాలా మంది ఇన్వెస్టర్లు తాము కొన్న స్టాక్స్ ను కేవలం రెండు కారణాల వల్లే అమ్ముతారు. అందులో ఒకటి భయం, రెండు సహనం కోల్పోవడం. కానీ, అంతకు మించిన అంశాలు ఉంటాయి .ఇన్వెస్టర్లు చేసే పొరపాట్లు ఇవేఒక స్టాక్ ధర కొద్దిగా పడగానే భయపడిపోయి అమ్మేస్తుంటారు. లేదా ఒక మంచి షేరు కొన్న తర్వాత ఏడాది పాటు అది ఎక్కడికీ కదలకుండా ఒకే రేంజ్‌లో ఉంటే బోర్ కొట్టి సహనం కోల్పోయి విక్రయిస్తుంటారు. నిజానికి ఇవి మార్కెట్ నియమాలు కావు. కేవలం మన మానసిక పరిస్థితికి సంబంధించిన అంశాలు మాత్రమే. ఒక బిజినెస్ విలువ ఏంటో మీకు పక్కాగా తెలిస్తే ఆ షేరును ఎప్పుడు ఉంచుకోవాలి, ఎప్పుడు వదిలించుకోవాలి అనేది స్పష్టంగా అర్థమవుతుంది. ఎవరూ చెప్పని కొన్ని టిప్స్..మంచి కంపెనీలను గుర్తించడం: ఒక కంపెనీని మార్కెట్లో తిరుగులేని శక్తిగా మార్చే అంశాలు ఏంటి?లాంగ్ టర్మ్‌లో నిలబడే పోటీతత్వ ప్రయోజనాలు ఉన్న కంపెనీలను ఎలా కనిపెట్టాలో తెలుసుకోవాలి. పోటీదారులను తట్టుకునే శక్తి ఉన్న కంపెనీలను ఎంచుకోగలిగితే దీర్ఘకాలంలో షేరు మంచి పనితీరు కనబరిచే అవకాశం ఉంటుంది.

# నేడు ఘట్కేసర్‌లో సీఎం పర్యటన





**ఘట్కేసర్, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర కవి, రచయిత అందె శ్రీ జయంతి వేడుకల సందర్భంగా ఘట్కేసర్‌లోని ఆయన సమాధి ప్రాంగణంలో "అందె శ్రీ స్మృతి వనం"కు శంకుస్థాపన చేయనున్నారు. రూ.3.95 కోట్ల వ్యయంతో ఈ స్మృతి వనం నిర్మాణం జరగనుందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. శనివారం సీఎం పర్యటనకు ముందుగా శుక్రవారం అధికారులు, పార్టీ కార్యకర్తలతో కలిసి స్మృతి వనం ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన, మీడియాతో మాట్లాడుతూ "తెలంగాణ భాషా, సాంస్కృతిక, సాహిత్య వికాసానికి విశేష సేవలందించిన కవి అందె శ్రీ జ్ఞాపకార్థం ఈ స్మృతి వనం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది" అని అన్నారు. అందె శ్రీ సాహిత్య వారసత్వాన్ని భావితరాలకు పరిచయం చేయడంతో పాటు తెలంగాణ ఆత్మగౌరవం, భాషా వైభవం, సాంస్కృతిక సంపదను ప్రతిబింబించే కేంద్రంగా ఈ స్మృతి వనం రూపుదిద్దుకోనుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, డీసీసీ సెక్రటరీ ముత్యాలు యాదవ్, ఘట్కేసర్, ఎదులాబాద్, పోచారం, బోడుప్పల్ డివిజన్ల అధ్యక్షులు బొక్క ప్రభాకర్ రెడ్డి, సామల అమర్, కర్రె రాజేష్, పోగుల దిలీప్ రెడ్డి, గడ్డన్నారం ఫ్రూట్స్ మార్కెట్ డైరెక్టర్ చందర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేసిన కలెక్టర్



**కల్వకుర్తి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పటేల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు శంకర్ విధులకు గైర్హాజరైన విషయం కలెక్టర్ దృష్టికి రావడంతో, ఆయనను తక్షణ ప్రభావంతో సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎ. రమేష్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం, పాఠశాలల పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించినందుకు కల్వకుర్తి మండల విద్యాధికారి (ఎంఈవో) శంకర్ నాయక్కు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి విధులకు క్రమం తప్పకుండా హాజరుకావాలి. బాధ్యతలను నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థలో జవాబుదారీతనం పెంపొందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని, పాఠశాలల్లో తనిఖీలు మరింత విస్తృతంగా కొనసాగనున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి తెలిపారు.

### శీర్షిక :- కాశీ పురాదీశ్వరి వారాహి

# కరుణించు జగదీశ్వరి!



ప్రక్రియ :- గేయం కీర్తన
వారాహి అమ్మవారి కీర్తన వారాహి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేకంగా
పల్లవి:- కాశీపురాదీశ్వరీ వారాహి
కరుణించు జగదీశ్వరీ //2//
సప్త మాతృక తల్లి సర్వేశ్వరీ
శక్తి స్వరూపిణి శరణంటిమి తల్లి !
కాశీపురాదీశ్వరీ
చ:- ధర్మరక్షణ జేయ దానవులనుజంపి
శత్రు సంహారము శరవేగమున జేసి//2//
దేవతల మొరవిని ధరణినిగ్గంచిన
వారాహి తల్లి వందనమమ్మ!
కాశీపురాదీశ్వరీ
చ:- రాత్రివేళలయందు తాంత్రిక పూజలు గొని భక్తజనులను బ్రోచి భవములన్నియు బాపి//2//వరాహ రూపమున వాత్సల్యంతో తల్లి దివ్య దర్శనమిస్తూ ధిషణిలో నిలిచిన !
కాశీపురాదీశ్వరీ
చ:- ఆషాఢమాసాన అమ్మను సేవించి
నవరాత్రులు తల్లి నామస్మరణచేసి//2//
అఖిలాండేశ్వరిని ఆరాధించిన
సకల సంపదలు ఇచ్చే సమతామూర్తీ !
కాశీపురాదీశ్వరీ
వారాహి అమ్మవారి దివ్య చరణారవిందార్పనమస్తు సాహిత్యరచన :-పుల్లూరి నాగేశ్వర్
కవి రచయిత గాయకులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల కాటారం జయశంకర్
భూపాలపల్లి జిల్లా

# అక్రమ ఇసుక రవాణాపై కేసు నమోదు



**కల్వకుర్తి, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మండల పరిధిలోని లింగసానిపల్లి గ్రామ వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. తర్నికల్ వద్ద వాహనాన్ని ఆపి స్వాధీనం చేసుకున్న అనంతరం కల్వకుర్తి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ కురుమూర్తి మాట్లాడుతూ, "అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు" అని హెచ్చరించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు.

# కుల, మత విద్వేషాలను రెచ్చగొట్టిన వ్యక్తి అరెస్ట్




**నందికొట్కూరు, జూలై 17 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నంద్యాల జిల్లా జూపాడుబంగ్లా పోలీస్ స్టేషన్ పరిధిలో హిందూ దేవుళ్లపై అవమానకరంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. సాలివేరి వెంకటేష్ ఫిర్యాదు మేరకు దర్యాప్తు జరిపిన పోలీసులు, జూపాడుబంగ్లా సంత మార్కెట్ ఎదురుగా రేషన్ షాప్ నడుపుతున్న ఎస్. మహమ్మద్ అబ్దుల్ సలాం అనే వ్యక్తి ఈ పోస్టులు పెట్టినట్లు గుర్తించారు. విచారణలో అతను చేసిన తప్పును ఒప్పుకుని అదే ఫేస్‌బుక్ ఖాతాలో క్షమాపణ కోరాడు. అనంతరం పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ ఐపీఎస్ హెచ్చరిస్తూ, కులాలు, మతాలను కించపరిచే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

RNI - TELTEL/2023/87644

# రోహిత్ ఖాతాలో అన్‌బిలీవబుల్ వరల్డ్ రికార్డులు




ఇప్పటికే టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించిన రోహిత్ శర్మ.. కేవలం 2027 వన్డే వరల్డ్ కప్ కోసమే బరిలోకి దిగుతున్నాడు. అయితే తాజాగా ప్రపంచకప్ ప్రణాళికల్లో రోహిత్ లేడని బీసీసీఐ తేల్చి చెప్పినట్లు సమాచారం. ఇంగ్లాండ్ తో జరిగే మూడో వన్డే తర్వాత తను క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించ వచ్చునే ఊహాగానాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో అతని అద్భుత రికార్డుల గురించి తెలుసుకుందాం. ఇండియా క్రికెట్ టీమ్ స్టార్ ఓపెనర్, హిట్‌మ్యాన్ రోహిత్ శర్మ లిమిటెడ్ ఓవర్ల ఫార్మాట్ లో ప్రపంచంలోనే మోస్ట్ డేంజరస్ బ్యాటర్ గా సరికొత్త హిస్టరీ క్రియేట్ చేశాడు. వన్డే ఇంటర్నేషనల్స్ హిస్టరీలోనే ఒకే ఒక్క మ్యాచ్ లో 264 రన్స్ సంచలన స్కోర్ కొట్టి హైయెస్ట్ ఇండివిడ్యువల్ స్కోరర్ గా అగ్రస్థానంలో నిలిచాడు. వరల్డ్ వైడ్ గా వన్డే ఫార్మాట్ లో మూడు డబుల్ సెంచరీలు బాదిన ఏకైక ఏకైక క్రికెటర్ గా రోహిత్ నిలిచాడు. ఇంటర్నేషనల్ క్రికెట్ లోని అన్ని ఫార్మాట్లు కలుపుకుని ఏకంగా 600 కి పైగా సిక్సర్లు బాది గ్లోబల్ సిక్స్-హిట్ లీడర్ గా సరికొత్త రికార్డ్ నెలకొల్పాడు. 2019 ఐసీసీ మెన్స్ వన్డే వరల్డ్ కప్ లో ఒకే ఎడిషన్ లో ఐదు సెంచరీలు కొట్టిన ఫస్ట్ మేల్ క్రికెటర్ గా హిస్టరీ క్రియేట్ చేయడంతో పాటు, కెప్టెన్ గా ఇండియాకు 2024 టీ20 వరల్డ్ కప్ టైటిల్, 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని అందించి రెండు ఐసీసీ టైటిళ్లు అందించిన లీడర్ గా ధోనీ తర్వాత స్థానంలో ఉన్నాడు. వన్డే, టీ20 ఫార్మాట్లలో రోహిత్ శర్మ సాధించిన అఫీషియల్ కెరీర్ రికార్డుల కంప్లీట్ డేటా చూస్తే, స్టులు 67 టెస్టులలో 4,300కిపైగా పరుగులతో పాటు 12 సెంచరీలు చేశాడు. అలాగే 287 వన్డేలలో 11,730 పరుగులు, 33 సెంచరీలు నమోదు చేశాడు. 159 టీ20లలో 4,231 పరుగులు చేయగా, అందులో 5 సెంచరలు ఉన్నాయి. రోహిత్ శర్మ వన్డే క్రికెట్ లో చూపించిన ఇంపాక్ట్, అతని సాలిడ్ రన్ రేట్ ఇంటర్నేషనల్ క్రికెట్ లోనే లెజెండరీగా నిలిచాయని క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రెజెంట్ వన్డేలలో రోహిత్ శర్మ మోస్ట్ డిస్ట్రక్టివ్ ప్లేయర్లలో ఒకరు. అలాగే కెప్టెన్ గా కూడా వన్డే ప్రపంచకప్ ఫైనల్ కు 2011 తర్వాత రోహితే చేర్చడం విశేషం. సొంతగడ్డపై 2023లో జరిగిన ఎడిషన్ లో ఇండియా రన్నరప్ గా నిలిచింది. వన్డే, టీ20 ఫార్మాట్లలో రోహిత్ శర్మ సాధించిన అఫీషియల్ కెరీర్ రికార్డుల కంప్లీట్ డేటా చూస్తే, స్టులు 67 టెస్టులలో 4,300కిపైగా పరుగులతో పాటు 12 సెంచరీలు చేశాడు. అలాగే 287 వన్డేలలో 11,730 పరుగులు, 33 సెంచరీలు నమోదు చేశాడు. 159 టీ20లలో 4,231 పరుగులు చేయగా, అందులో 5 సెంచరలు ఉన్నాయి. రోహిత్ శర్మ వన్డే క్రికెట్ లో చూపించిన ఇంపాక్ట్, అతని సాలిడ్ రన్ రేట్ ఇంటర్నేషనల్ క్రికెట్ లోనే లెజెండరీగా నిలిచాయని క్రికెట్ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ప్రెజెంట్ వన్డేలలో రోహిత్ శర్మ మోస్ట్ డిస్ట్రక్టివ్ ప్లేయర్లలో ఒకరు. అలాగే కెప్టెన్ గా కూడా వన్డే ప్రపంచకప్ ఫైనల్ కు 2011 తర్వాత రోహితే చేర్చడం విశేషం. సొంతగడ్డపై 2023లో జరిగిన ఎడిషన్ లో ఇండియా రన్నరప్‌గా నిలిచింది. ఇండియన్ ప్రీమియర్ లీగ్ హిస్టరీలోనూ రోహిత్ శర్మ ఒక సంచలన రికార్డ్ క్రియేట్ చేశాడు. ఐపీఎల్ లో మొత్తం సిక్స్ టైమ్స్ టైటిల్ విన్నర్ గా నిలిచాడు. ఫస్ట్ 2009 లో డెక్కన్ చార్జర్స్ టీమ్ లో ప్లేయర్ గా టైటిల్ గెలవగా, ఆ తర్వాత ముంబై ఇండియన్స్ కు కెప్టెన్ గా మారి ఏకంగా ఐదు అద్భుతమైన ఐపీఎల్ ట్రోఫీలను (2013, 2015, 2017, 2019, 2020) అందించి లీగ్ హిస్టరీలోనే మోస్ట్ సక్సెస్ ఫుల్ కెప్టెన్ గా నిలిచాడు. ముంబై ఇండియన్స్ ను లీగ్ లోనే ఒక మోస్ట్ రెస్పెక్టెడ్ టీమ్ గా బిల్డ్ చేయడంలో రోహిత్ కీ రోల్ ప్లే చేశాడు. ఐపీఎల్లో కేవలం కెప్టెన్సీ లోనే కాకుండా బ్యాటింగ్ లోనూ రోహిత్ శర్మ ఒక ఎలైట్ రన్ స్కోరర్ గా నిలిచాడు. లీగ్ లో ఏకంగా 6,000 కంటే ఎక్కువ రన్స్ స్కోర్ చేయడంతో పాటు మల్టిపుల్ సెంచరీలు, హాఫ్ సెంచరీలు బాదాడు. లీగ్ లో అత్యధిక సిక్సర్లు కొట్టిన ఇండియన్ ప్లేయర్ గా రోహిత్ పేరిట ఒక క్రేజీ రికార్డ్ ఉంది. ఈ సాలిడ్ పర్ఫార్మెన్స్ ల వల్లే ఐపీఎల్ హిస్టరీలోనే ఒక అల్-టైమ్ గ్రేట్ స్టాల్వర్ట్ గా రోహిత్ శర్మ నిలిచాడు. ఏదేమైనా రిటైర్మెంట్ గురించి రోహిత్ నుంచి స్పష్టత రాకపోయినా, మూడో వన్డే తర్వాత ఈ విషయంపై క్లారిటీ వచ్చే అవకాశముంది. మరోవైపు రిటైర్మెంట్ వార్తతో హిట్ మ్యాన్ అభిమానులు ఉలిక్కి పడుతున్నారు. సోషల్ మీడియాలో రోహిత్ గురించి పోస్టులు పెడుతున్నారు. తన ఘనతల గురించి, ట్రేడ్ మార్క్ పుల్ షాట్ గురించి మాట్లాడుతున్నారు.

# రికార్డు క్రియేట్ చేసిన జో రూట్..!

భారత్‌తో జరిగిన రెండో వన్డేలో, ఇంగ్లాండ్ బ్యాటర్ జో రూట్ 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచి అరుదైన రికార్డు సాధించాడు. వన్డే అంతర్జాతీయ క్రికెట్‌లో ఈ ఘనత సాధించిన మొట్టమొదటి ఇంగ్లాండ్ బ్యాట్స్‌మెన్‌గా అతడు చరిత్ర సృష్టించాడు. కెన్నింగ్‌టన్ ఓవల్‌లో జరిగిన ఈ మ్యాచ్‌లో రూట్ అద్భుత ఆటతీరుతో ఆకట్టుకున్నాడు. ఛేజింగ్‌లో జట్టును ముందుండి నడిపించాడు. భారత్ నిర్దేశించిన 234 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో అతడు 99 రన్స్‌తో నాటౌట్‌గా నిలిచాడు. తన 17న వన్డే సెంచరీకి కేవలం ఒక్క పరుగు దూరంలో నిలిచిపోయాడు. ఈ ఉత్కంఠభరితమైన ముగింపుతో, ఈ సీనియర్ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ మొత్తం వన్డే చరిత్రలో 99 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన 17వ బ్యాట్స్‌మన్‌గా నిలిచాడు. గతంలో అలెన్ లాంబ్, అలెక్స్ హేల్స్, జోస్ బట్లర్ వంటి పలువురు ఇంగ్లాండ్ ఆటగాళు 50 ఓవర్ల ఫార్మాట్‌లో 99 పరుగుల వద్ద ఔట్ అయ్యారు. అయితే సక్సెస్‌ఫుల్ ఛేజింగ్‌లో చివరి వరకూ క్రీజులో ఉండి.. సెంచరీకి కేవలం ఒక పరుగు దూరంలో నిలిచిన తొలి ఇంగ్లీష్ ఆటగాడు రూట్ మాత్రమే కావడం గమనార్హం. ఇంగ్లాండ్ ఛేజింగ్ చివరి దశలో ఈ ఘనత నమోదైంది. నిజానికి రూట్ ఈజీగా సెంచరీ చేసేలా కనిపించాడు. 234 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన ఇంగ్లాండ్.. 42 ఓవర్లు ముగిసే సరికి 214/6తో నిలిచింది. ఆ సమయంలో రూట్.. 130 బంతుల్లో 97 రన్స్ చేశాడు. ఇంగ్లాండ్ విజయానికి ఇంకా 20 రన్స్ అవసరం. కానీ గస్ అట్కిన్సన్.. రూట్‌కు సెంచరీని దూరం చేశాడు. 16 బంతుల్లో 23 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. దీంతో రూట్ ఆట చివరకు.. 133 బంతుల్లో 99 పరుగులు చేసి



నాటౌట్‌గా మిగిలిపోయాడు. సెంచరీ మిస్ అయినా.. రూట్ ఇంగ్లాండ్‌ను ఒంటిచేత్తో గెలిపించాడు. మిగతా బ్యాటర్లు విఫలమైన ఇదే పిచ్‌పై నిలకడగా రాణించి.. సిరీస్‌ను ఇంగ్లాండ్ 1-1తో సమం చేయడంలో కీలకపాత్ర పోషించాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

# అంతర్జాతీయ క్రికెట్‌లో రికార్డు సృష్టించిన కోహ్లీ

భారత క్రికెట్ దిగ్గజం, రన్ మెషిన్ విరాట్ కోహ్లీ అంతర్జాతీయ క్రికెట్‌లో సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇంగ్లాండ్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్ ద్వారా కోహ్లీ తన కెరీర్‌లో మరో అరుదైన మైలురాయిని దాటాడు. ప్రపంచ క్రికెట్‌లో అత్యధిక అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ పేరిట ఉన్న రికార్డును కోహ్లీ బద్దలు కొట్టాడు. 561వ అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన కోహ్లీ.. 560 మ్యాచ్‌లు ఆడిన రికీ పాంటింగ్‌ను అధిగమించి ఈ ఎలైట్ లిస్టులో ఐదో స్థానాన్ని సొంతం చేసుకున్నాడు. కోహ్లీ తన అంతర్జాతీయ కెరీర్‌ను 2008లో ప్రారంభించాడు. అప్పటి నుంచి ఇప్పటివరకు కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. ప్రస్తుతం టెస్ట్, టీ20లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేలు మాత్రమే ఆడుతున్నాడు. ఫార్మాట్ ఏదైనా తనదైన బ్యాటింగ్‌తో జట్టుకు ఎన్నో అపురూప విజయాలు అందించిన కోహ్లీ, ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో చారిత్రాత్మక రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. ఇప్పుడు ఏకంగా అత్యధిక మ్యాచ్‌లు ఆడిన లెజెండరీ ఆటగాళ్ల సరసన నిలిచి తన స్థాయి ఏంటో మరోసారి ప్రపంచానికి నిరూపించాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో అత్యధిక మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్ల జాబితాలో భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్ 664 మ్యాచులతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అతడి తర్వాత శ్రీలంక మాజీ ఆటగాళ్లు మహేల జయవర్ధనే 652 మ్యాచులతో రెండో స్థానంలో, కుమార సంగక్కర 594 మ్యాచులతో మూడో స్థానంలో, సనత్ జయసూర్య 586 మ్యాచులతో నాలుగో స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్న కోహ్లీ.. యాక్టివ్ క్రికెటర్లలో అందరికంటే ఎక్కువ మ్యాచ్‌లు ఆడిన ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. భారత మాజీ కెప్టెన్ ఎంఎస్ ధోనీ 538 మ్యాచులతో ఈ జాబితాలో ఏడో స్థానంలో ఉన్నాడు. కోహ్లీ వయసు, ఫామ్‌తో సంబంధం లేకుండా నిరంతరం కష్టపడుతూ ఫిట్‌నెస్ విషయంలో యువ ఆటగాళ్లకు రోల్ మోడల్‌గా నిలుస్తున్నాడు. సుదీర్ఘ విరామం తర్వాత ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్ ద్వారా రీఎంట్రీ ఇచ్చిన అతడు.. గురువారం జరిగిన రెండో వన్డేలో హాఫ్ సెంచరీతో సత్తాచాటాడు.



# చరిత్ర సృష్టించిన కీరన్ పొలార్డ్!

వెస్టిండీస్ క్రికెట్ దిగ్గజం కీరన్ పొలార్డ్ చరిత్ర సృష్టించాడు. టీ20 క్రికెట్‌లో 1000 సిక్సర్లను పూర్తి చేసుకున్నాడు. తద్వారా ప్రపంచంలోనే ఈ ఘనతను అందుకున్న రెండో బ్యాటర్‌గా నిలిచాడు. అగ్రరాజ్యం అమెరికా వేదికగా జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ టోర్నీలో ముంబై న్యూయార్క్‌కు సారథ్యం వహిస్తున్న పొలార్డ్.. వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన ఎలిమినేటర్-1 మ్యాచ్‌లో ఈ ఫీట్ సాధించాడు. ఈ మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన పొలార్డ్.. 25 బంతుల్లోనే 250కి పైగా స్ట్రైక్‌రేట్‌తో 64 పరుగులు చేశాడు. ఇందులో 8 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఈ మ్యాచ్‌కు ముందు 1000 సిక్సర్ల మైలురాయికి 7 సిక్సర్ల దూరంలో ఉన్న పొలార్డ్.. ఈ మ్యాచ్‌లో 8 బాది ఈ అరుదైన ఫీట్ సాధించాడు. 39 ఏళ్ల ఏళ్ల వయసులో పొలార్డ్ ఈ ఫీట్ సాధించాడు. టీ20 క్రికెట్‌లో అత్యధిక సిక్సర్ల రికార్డ్ వెస్టిండీస్‌కే చెందిన యూనివర్సల్ బాస్ క్రిస్ గేల్ పేరిట ఉంది. అతను 463 మ్యాచ్‌ల్లో 1056 సిక్సర్లు కొట్టాడు. 745 మ్యాచ్‌లు ఆడిన పొలార్డ్.. గేల్ రికార్డ్‌ను అధిగమించడానికి ఇంకా 56 సిక్సర్లు కావాలి. ఈ జాబితాలో వెస్టిండీస్‌కే చెందిన ఆండ్రీ



రస్సెల్ 792 సిక్సర్లతో మూడో స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్ కీరన్ పొలార్డ్ రాణించినా ముంబై న్యూయార్క్‌కు ఓటమి తప్పలేదు. ఆండ్రీస్ గౌస్ అద్భుత శతకంతో వాషింగ్టన్ ఫ్రీడమ్ 6 వికెట్ల తేడాతో ముంబై న్యూయార్క్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎంఐ న్యూయార్క్ నిర్ణీత 20 ఓవర్లలో 267 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. నికోలస్ పూరన్(33 బంతుల్లో 5 ఫోర్లు, 13 సిక్స్‌లతో 106) సెంచరీతో చెలరేగగా.. కీరన్ పోలార్డ్(25 బంతుల్లో ఫోర్, 8 సిక్స్‌లతో 64) హాఫ్ సెంచరీతో రాణించాడు. అనంతరం వాషింగ్టన్ ఫ్రీడమ్ 18.4 ఓవర్లలో 270 పరుగులు చేసి రికార్డ్ విజయాన్ని అందుకుంది. కెప్టెన్ స్టీవ్ స్మిత్(110లి), ఆండ్రిస్ గోస్(132) శతకాలతో చెలరేగాడు. టీ20 క్రికెట్ చరిత్రలోనే అతిపెద్ద ఛేజింగ్ రికార్డ్‌ను సొంతం చేసుకుంది.

# తొలిసారి జపాన్ ఓపెన్ సెమీస్‌కు పీవీ సింధు




**హైదరాబాద్ :** తన సుదీర్ఘ కెరీర్‌లో తొలిసారిగా భారత స్టార్ షట్లర్ పీవీ సింధు జపాన్ ఓపెన్ సూపర్ 750 టోర్నీ సెమీఫైనల్స్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్స్‌లో ప్రత్యర్థి నొజుమి ఒకుహార వైదొలగడంతో సింధుకు వాకోవర్ లభించింది. రెండు ఒలింపిక్ పతకాలు సాధించిన సింధు, జపాన్ ఓపెన్‌లో ఇదే ఆమె అత్యుత్తమ ప్రదర్శన. సెమీఫైనల్స్‌లో ఆమె ఒలింపిక్ ఛాంపియన్ చెన్ యుఫైతో తలపడనుంది. 15 ఏళ్ల తర్వాత భారత మహిళా షట్లర్ ఈ టోర్నీలో సెమీఫైనల్ చేరడం విశేషం. గతంలో సైనా నెహ్వాల్ 2011లో సెమీస్‌కు చేరి ఓటమిపాలైంది.

# తెలుగు ఇండస్ట్రీని ఆకాశానికెత్తిన

## రకుల్ ప్రీత్.. బాలీవుడ్‌పై తీవ్ర విమర్శలు

టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల పనితీరుపై కథానాయిక రకుల్ ప్రీత్ సింగ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని సహకార స్ఫూర్తిని కొనియాడిన ఆమె, బాలీవుడ్‌లో మాత్రం అభద్రతాభావం, అసూయ వంటి ధోరణులు ఎక్కువగా కనిపిస్తాయని అభిప్రాయపడ్డారు.

ఇటీవల ఒక ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్, తన సినీ ప్రయాణం మొదలైన తెలుగు చిత్ర పరిశ్రమపై ప్రశంసలు కురిపించారు. "టాలీవుడ్‌లో ఒకరి సినిమాలను మరొకరు బహిరంగంగా ప్రోత్సహిస్తారు. తోటి నటీనటుల చిత్రాల ట్రైలర్లను వదుదల చేయడం, వేడుకలకు హాజరవ్వడం వంటివి ఇక్కడ సాధారణం. వృత్తిపరమైన పోటీ ఉన్నప్పటికీ, ఒకరి విజయాన్ని మరొకరు మనస్ఫూర్తిగా ఆస్వాదిస్తారు" అని ఆమె పేర్కొన్నారు.ఈ విషయంలో బాలీవుడ్ పరిస్థితి భిన్నంగా ఉంటుందని, అక్కడ అసూయ, అభద్రతాభావం కారణంగా పరస్పర సహకారం చాలా తక్కువని ఆమె అన్నారు. కొందరు కావాలనే ఇతరులపై ప్రతికూల ప్రచారాలు (నెగెటివ్ పీఆర్ క్యాంపెయిన్లు) నిర్వహిస్తారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు."తెలుగు పరిశ్రమలో ఐక్యత, సహృద్భావం మెండుగా ఉంటాయి. ఈ లక్షణాలను హిందీ పరిశ్రమ కూడా అలవర్చుకుంటే అది మరింత బలోపేతం అవుతుంది" అని రకుల్ సూచించారు. గతంలోనూ అల్లు అర్జున్, మహేశ్ బాబు వంటి అగ్ర హీరోల వినయాన్ని, వృత్తి పట్ల వారికున్న నిబద్ధతను ఆమె కొనియాడారు. దక్షిణాదిలో గడించిన అనుభవాలే తన కెరీర్‌ను తీర్చిదిద్దాయని, ఇక్కడి ప్రేక్షకుల ఆదరణ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానని ఆమె కృతజ్ఞత చాటుకున్నారు. రకుల్ చేసిన ఈ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో విశేష స్పందన లభిస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులు ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. తన ఎదుగుదలకు తోడ్పడిన పరిశ్రమ పట్ల ఆమె చూపిన గౌరవానికి నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



# ఉప ఎన్నికలకు సిద్ధం

## టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయం..




టాలీవుడ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (ఞీణణూ) కీలక నిర్ణయం తీసుకుంది. మొత్తం అసోసియేషన్ ఎన్నికలకు సిద్ధమవుతున్నట్టు ప్రకటించింది. ఫెడరేషన్ జోక్యాన్ని ఖండిస్తూ లేఖ విడుదల చేసిన అసోసియేషన్, ఖాళీ అయిన పోస్టులకు ఎన్నికలు నిర్వహించాలని మెజార్టీ సభ్యుల డిమాండ్ మేరకు ఉప ఎన్నికలకు నిర్ణయం తీసుకుంది. ఎన్నికల ప్రక్రియను జులై 20న నామినేషన్లు దాఖలు స్వీకరించడంతో ప్రారంభించనున్నట్లు అసోసియేషన్ ప్రకటించింది. ఎన్నికల అధికారి అదే రోజు నుంచి నామినేషన్ల పరిశీలన చేయనున్నట్లు తెలిపింది. జులై 22 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేసింది.

ఎన్నికల నిబంధనల ప్రకారమే ఈ ఎలక్షన్స్ జరుగుతాయని అసోసియేషన్ తెలిపింది. అసోసియేషన్‌లో ఇటీవల జరిగిన వివాదం నేపథ్యంలో 10 మంది సభ్యులను సస్పెండ్ చేశారు. మిగిలిన ఆరుగురు కూడా ఉప ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు ప్రకటించడంతో అసోసియేషన్ ఈ నిర్ణయం తీసుకుంది. ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు అసోసియేషన్ స్పష్టం చేసింది.

# సరికొత్త సామాజిక క్యాంపెయిన్.. రకుల్, సమంతలకు కాజల్ సవాల్!

ఆహార కల్తీ, ప్రజలపై పడుతున్న దుష్ప్రభావాలపై క్యాంపెయిన్

మనం తినే ఆహారం నిజంగానే సురక్షితమా అని ప్రశ్న

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ కాజల్ అగర్వాల్ తన లేటెస్ట్ చిత్రం 'ది ఇండియన్ స్టోరీ' ప్రమోషన్స్‌లో భాగంగా సామాజిక అవగాహన క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. పురుగుమందుల వాడకం, ఆహార కల్తీ, దానివల్ల ప్రజల ఆరోగ్యంపై పడుతున్న దుష్ప్రభావాలను ఈ సినిమాలో చూపించారు. చేతన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో కాజల్, శ్రేయస్ తల్పడే జంటగా నటించారు.

ఈ క్రమంలో, కాజల్ #WhatsOnYourPlateµ (మీ ప్లేట్ లో ఏముంది) అవగాహన ప్రచారాన్ని ప్రారంభించింది. తన రాత్రి భోజనం ఫోటోను సోషల్ మీడియాలో పంచుకుంటూ, మనం తినే ఆహారం నిజంగా సురక్షితమేనా అని ప్రశ్నించింది. ప్రతి ఒక్కరూ తాము తినే ఆహారం పట్ల మరింత శ్రద్ధ వహించాలని కోరింది. ఈ ఛాలెంజ్‌లో టాలీవుడ్ స్టార్ హీరోయిన్లు రకుల్ ప్రీత్ సింగ్, సమంతలను కూడా పాల్గొనమని సవాల్ విసిరింది.

నటుడు శ్రేయస్ తల్పడే కూడా కాజల్ అభిప్రాయాన్ని బలపరుస్తూ పోస్ట్ చేశాడు. ప్రజలందరూ బాధ్యతాయుతమైన వినియోగదారులుగా మారాలని, మనం ప్లేట్లలో పెట్టుకుని తినే ఆహారం వెనుక ఉన్న అసలు నిజాలు, నివేదించబడని సమస్యలపై చర్చ జరగాలని శ్రేయస్ పిలుపునిచ్చాడు.

ఈ చిత్రం వివరాల్లోకి వస్తే... జీ స్టూడియోస్, ఎమ్ఐజీ ప్రొడక్షన్ స్టూడియోస్ సమర్పకులుగా

# నలుగురు హీరోయిన్లు?

## రాఘవ లారెన్స్ 30వ సినిమాపై ఆసక్తికర ప్రచారం

## లారెన్స్ సరసన సాయి పల్లవి, జాన్వీ, రుక్మిణి, కయాదు

## ఇది లారెన్స్ సొంత నిర్మాణ సంస్థలో రానున్న చిత్రం

## నూతన దర్శకుడు తిరుపుగల్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్న వైనం




నటుడు, కొరియోగ్రాఫర్ రాఘవ లారెన్స్ తన కెరీర్‌లో మైలురాయిగా నిలిచే 30వ సినిమాకు సిద్ధమవుతున్నారు. 'ూ-30' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ ప్రాజెక్ట్‌ను ఇటీవలే అధికారికంగా ప్రకటించారు. అయితే, సినిమా ప్రారంభం కాకముందే దీని క్యాస్టింగ్ సంచలనంగా మారింది. ఈ చిత్రంలో ఒకరు కాదు, ఏకంగా నలుగురు ప్రముఖ హీరోయిన్లు నటించనున్నారంటూ వార్తలు వచ్చాయి.ఈ భారీ చిత్రంలో సాయి పల్లవి, జాన్వీ కపూర్, రుక్మిణి వసంత్, కయాదు లోహర్ కీలక పాత్రలు పోషించనున్నారని సోషల్ మీడియాలో వార్తలు వైరల్ అవుతున్నాయి. ఈ నలుగురు నటీమణులకు ఉన్న క్రేజ్ దృష్ట్యా సౌత్ ఇండియన్ సినిమాలో ఇది చర్చనీయాంశం అయింది. దాంతో సినిమాపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి.

ఈ చిత్రాన్ని రాఘవ లారెన్స్ తన సొంత నిర్మాణ సంస్థ 'రాఘవేంద్ర ప్రొడక్షన్స్' బ్యానర్‌పై నిర్మిస్తుండటం విశేషం. తిరుపుగల్ అనే నూతన దర్శకుడు ఈ సినిమాతో పరిచయం అవుతున్నారు. సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తున్నారు. ఇంటెన్స్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాపై హీరోయిన్ల వార్తలతో ప్రేక్షకుల్లో ఆసక్తి రెట్టింపైంది.



# సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి '3 ఇడియట్స్' హీరో పాత్రను రూపొందించలేదు: ఆమిర్ ఖాన్



బాలీవుడ్ సూపర్ హిట్ చిత్రం '3 ఇడియట్స్'లోని ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్ర ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. ఈ పాత్రను అగ్ర కథానాయకుడు ఆమిర్ ఖాన్ పోషించిన సంగతి తెలిసిందే. అయితే, ఆ పాత్రకు లడఖ్‌కు చెందిన ప్రముఖ విద్యావేత్త, సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ స్ఫూర్తి అని చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ విషయంపై ఆమిర్ ఖాన్ స్వయంగా స్పందించారు. ఆ ప్రచారంలో వాస్తవం లేదని స్పష్టం చేశారు. సోనమ్ వాంగ్‌చుక్‌కు, ఆ పాత్రకు ఎలాంటి సంబంధం లేదని వెల్లడించారు. లండన్ ఇండియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఆమిర్ మాట్లాడారు. '3 ఇడియట్స్' కథా చర్చల సమయంలో తమకు సోనమ్ వాంగ్‌చుక్ గురించి తెలియదని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా కూడా ఆయన్ను ఎప్పుడూ కలవలేదని చెప్పారు. అందుకే ఫున్‌సుఖ్ వాంగ్డూ పాత్రను ఆయన జీవితం ఆధారంగా రూపొందించలేదని స్పష్టం చేశారు.ఈ సినిమాలో 'చతుర్' పాత్ర పోషించిన ఓమీ వైద్య విడుదల చేసిన ఒక వీడియోపై కూడా ఆమిర్ స్పందించారు. ఫున్‌సుఖ్ పాత్ర సోనమ్ వాంగ్‌చుక్‌ను చూసి రూపొందించారని ఓమి చెప్పడం సరికాదని ఆయన అన్నారు. ఆ వ్యాఖ్యల్లో వాస్తవం లేదని తేల్చిచెప్పారు.అయితే, సోనమ్ వాంగ్‌చుక్ చేస్తోన్న సామాజిక సేవలను తాను ఎంతగానో గౌరవిస్తానని ఆమిర్ తెలిపారు. ప్రస్తుతం ఆయన చేస్తోన్న నిరవధిక నిరాహార దీక్ష గురించి ప్రస్తావిస్తూ.. సోనమ్ ఆరోగ్యం క్షీణిస్తోందని, దీక్ష విరమించాలని పలువురు కోరుతున్నారని చెప్పారు. వాంగ్‌చుక్‌ను గౌరవించడానికి '3 ఇడియట్స్' పాత్రతో ముడిపెట్టాల్సిన అవసరం లేదని, ఆయన చేస్తోన్న కృషి అసామాన్యమైనదని ఆమిర్ కొనియాడారు.నీట్ పేపర్ లీక్ వివాదం నేపథ్యంలో సోనమ్ వాంగ్‌చుక్ గత 20 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుండడంతో వెంటనే దీక్ష విరమించాలని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, కేంద్ర ప్రభుత్వం ఆయన డిమాండ్లను పరిగణనలోకి తీసుకోవడం లేదనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి.

# ఓటీటీలోకి వచ్చేసిన 'మా ఇంటి బంగారం'..



స్టార్ హీరోయిన్ సమంత సుమారు మూడేళ్ల విరామం తర్వాత 'మా ఇంటి బంగారం' చిత్రంతో మంచి విజయాన్ని అందుకున్నారు. థియేటర్లలో బాక్సాఫీస్ వద్ద రికార్డు స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా, ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు ఓటీటీ వేదికపైకి వచ్చేసింది. హీరోయిన్ ఓరియెంటెడ్ చిత్రాల్లో రూ. 100 కోట్లకు పైగా వసూళ్లు సాధించిన తొలి తెలుగు సినిమాగా చరిత్ర సృష్టించిన ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్, ఇప్పుడు డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చింది.ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ 'జియో హాట్‌స్టార్' దక్కించుకుంది. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే గురువారం అర్ధరాత్రి నుంచే ఈ చిత్రం స్ట్రీమింగ్‌కు అందుబాటులోకి వచ్చింది. కేవలం తెలుగులోనే కాకుండా తమిళం, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ సినిమాను విడుదల చేశారు. దీంతో దక్షిణాది సినీ ప్రియులు ఈ చిత్రాన్ని వీక్షించేందుకు ఆసక్తి చూపుతున్నారు. థియేటర్లలో కుటుంబ ప్రేక్షకులను, ముఖ్యంగా మహిళలను ఎంతగానో ఆకట్టుకున్న ఈ సినిమా, ఇప్పుడు ఓటీటీలోనూ అదే ఆదరణ పొందుతుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది.